



వీడని ముసురు

- లోతట్టు ప్రాంతాలు జలమయం
- రోడ్లపై వరద నీటి ఉధృతి
- చెర్వులు, కుంటల్లోకి వరదనీరు
- పల్లె, పట్టణాల్లో వీధులన్నీ చిత్తడిచిత్తడి
- ఎక్కడి చెత్త అక్కడే..
- కూలుతున్న పాత ఇళ్లు, గోడలు
- ఊపందుకోనున్న వరినాట్ల పనులు
- పచ్చబడుతున్న పంట పొలాలు
- అప్రమత్తంగా ఉండాలని అధికారుల విజ్ఞప్తి
- 285 రాపిడ్ రెస్పాన్స్ టీమ్స్ ఏర్పాటు చేసిన వైద్యశాఖ

'వానమ్మ వానమ్మ వానమ్మా... ఒక్కసారన్న వచ్చిపోవే వానమ్మ' అన్న పాటకు మేఘాలు స్పందించినట్లున్నాయి. వానల కోసం ఆకాశం వైపు ఎదురుచూసిన అన్నదాతలో హర్షం వ్యక్తమయ్యేలా ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తోంది. వీడని వానలతో ఆకాశమంతా తడిసి ముద్దవుతోంది. నాలుగు రోజులుగా ముసురే ముసురు. ఎటు చూసినా వరదనీటి ప్రవాహాలే కనిపిస్తున్నాయి. వానలు ఇలానే కురిస్తే ఉప్పొంగే వరదలతో వాగులు, చెర్వులు, కుంటలు నిండి మత్తడి దూకనున్నాయి. వరి నాట్ల పనులు జోరందుకోనున్నాయి. మెట్ట పైర్లు పచ్చబడి ఏపుగా పెరుగుతున్నాయి. ఇదంతా బొమ్మకు ఒక వైపు అయితే మరో పక్క.. వర్షాలతో లోతట్టు ప్రాంతాలు జలమయమవుతున్నాయి. రోడ్లపై వరద నీరు ఉధృతిగా ప్రవహించడంతో చాలా చోట్ల రాకపోకలకు ఇబ్బందులు కల్గుతున్నాయి. ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయింది. పాత ఇళ్లు, గోడలు కూలుతున్నాయి. ఉమ్మడి మెదక్ జిల్లాలో నీరు, గాలి, పరిసరాల కాలుష్యం వల్ల వ్యాధులు ప్రబలే ప్రమాదం పొంచి ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు, ప్రజాప్రతినిధులు విజ్ఞప్తి చేస్తున్నారు.

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలో గురువారం నమోదైన వర్షాపాతం పరిశీలిస్తే... మెదక్ జిల్లాలో జిల్లా సగటు వర్షాపాతం 94.6 మిల్లీ మీటర్లుగా నమోదైంది. యెల్దుర్తిలో 144.1 మిల్లీ మీటర్లు, కొల్చారంలో 140.1, శంకరంపేట(ఆర్)లో 125.5, మెదక్‌లో 120.1, అల్లాదుర్గ 107.9, చిలిపిచేడు 111.2, కౌడిపల్లి 121.5, మాసాయిపేట 103.7, టేక్మాల్ 84.1, పాపన్నపేట 93.2, హవేలీఘన్‌పూర్ 94.0, తూప్రాన్ 87.4, శివంపేట 80.7, నర్సాపూర్ 81.3, చేగుంట 88.1, నార్సింగ్ 69.7, రేగోడు 60.6, శంకరంపేట ఎ 63.5, రామాయంపేట 69.5, నిజాంపేట 49.6 మిల్లీ మీటర్ల వర్షాపాతం నమోదైంది. సంగారెడ్డి జిల్లాలో సగటు వర్షాపాతం 61.1 మిల్లీ మీటర్లు నమోదైంది. అత్యధికంగా ఆందోల్ 108.7, చౌటకూరు 104.5, పుల్కల్ 96.2, హత్నూర 80.7, మొగుడంపల్లి 74.3, జహీరాబద్ 70.7, గుమ్మడిదల 79.0, జిన్నారం 78.2, అమీన్‌పూర్ 69.4, కోహీర్ 65.6, ఝరాసంఘం 62.6, మునిపల్లి 58.8, వట్‌పల్లి 66.7, సంగారెడ్డి 52.4, కొండాపూర్ 50.9, పటాన్‌చెరు 54.6, ఆర్‌సీ పురం 52.2, కంది 46.1, నిజాంపేట 47.5, న్యాల్‌కల్ 51.1, రాయికోడ్ 59.1, మనూరు 36.7, నాగిల్‌గిద్ద 33.3, నారాయణఖేడ్ 38.0, కల్హేర్ 41.1, సిర్గాపూర్ 37.3, కంగ్టి 32.1 మిల్లీ మీటర్లు నమోదైంది.

రైతుల హర్షం

ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా వానే వాన. వరద నీరు కుంటలు, చెర్వులు, వాగుల్లోకి చేరుతోంది. నాలుగు రోజులుగా వర్షాలు కురుస్తుండంతో భూగర్భంలోని నీరు చేరి నీటి మట్టం పెరిగేందుకు దోహదపడనుంది. వానాకాలం పంటలకు ఢోకా ఉండదని రైతులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 7.50 లక్షల ఎకరాల్లో పత్తి సాగైంది. కంది, ఇతర మెట్ట పంటలు కూడా వేశారు. పత్తి చేళ్లకు మందులేసి కలుపు తీస్తున్న దశలో వర్షాలు కురుస్తున్నాయి. దీంతో పైర్లు పచ్చబడి ఏపుగా పెరుగుతున్నాయి. మెట్ట పంటలకు వర్షాలు ఎంతో ఉపయోగపడతాయంటున్నారు. ఇప్పటి వరకు భారీ వర్షం పడకపోయే సరికి వరి నాట్లు వేయలేదు. నార్లు ముదురుతున్న సమయంలోనే వర్షాలు కురుస్తున్నాయి. దీంతో రైతులు వరి నాట్లు వేస్తున్నారు. మెదక్, సిద్దిపేట, సంగారెడ్డిలో వర్షంలోనే కూలీలు వరినాట్లు వేస్తున్నారు. దుక్కుల్ని చదును చేస్తున్నారు. భూగర్భ జల నీటి మట్టం పెరగడం, చెర్వులు, కుంటలు నిండడంతో రాబోయే కాలంలో బోరు, వావుల కింద పొలాలకు సరిపడ నీరు లభించనుంది.

లోతట్టు ప్రాంతాలు జలమయం

వర్షాలతో లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారాయి. వరదనీరు చేరుతుండడంతో కుంటలు, వాగుల్లోకి వరద నీరు ఉధృతంగా చేరుతుంది. సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్, దుబ్బాక, నర్సాపూర్, పటాన్‌చెరు, జహీరాబాద్, ఆందోల్, నారాయణఖేడ్ వంటి ప్రాంతాల్లో పలు చోట్ల రోడ్లపై వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ప్రజలకు రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కల్గుతుంది. పటాన్‌చెరు ప్రాంతంలో పలు చోట్ల రోడ్లపై నీరు నిల్వ ఉండడంతో కార్లు, బైక్ ప్రయాణాలు సాగట్లేదు. వట్‌పల్లి, మునిపల్లి, ఝరాసంగం, కోహీర్, జహీరాబాద్, సంగారెడ్డి ప్రాంతాల్లో పలు వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పట్టణాల్లో సంగారెడ్డి, పటాన్‌చెరు, గజ్వేల్, సిద్దిపేట, మెదక్ ప్రాంతాల్లో మోరీలు, మ్యాన్‌మోల్స్ ఉప్పొంగుతున్నాయి. దీంతో రోడ్లన్నీ నీటిమయంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో ఎక్కడ చూసినా వరదనీరు, బురద బురదగా మారాయి. పంచాయతీ సిబ్బంది సమ్మెలో ఉండడంతో ఎక్కడి చెత్త అక్కడే నిలిచిపోయింది. పట్టణాల్లోనూ కార్మికులు వర్షాల వల్ల చెత్త తీసే పరిస్థితి లేదు. కొన్ని ప్రాంతాల్లో లోతట్టు ప్రాంతాల్లో సాగు చేసిన వరి, పత్తి ఇతర పంటలు నీట మునుగుతున్నాయి. వెల్దుర్తి, కంగ్టి, హుస్నాబాద్, నారాయణఖేడ్ ఇతర మండలాల్లో పదుల సంఖ్యలో ఇళ్లు కూలాయి.

వ్యాధులు ప్రబలే ప్రమాదం

వర్షాలు వీడకుండా కురుస్తుండడంతో వాతావరణంలో పెనుమార్పులొచ్చాయి. చల్లని వాతావరణంతో పాటు పరిసరాలన్నీ అపరిశుభ్రంగా మారాయి. నీరు కలుషితమవుతోంది. దీంతో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదముందని వైద్యులు పేర్కొంటున్నారు. గ్రామాలు, పట్టణాల్లో చెత్తచెదారం వేసే చోట్ల దుర్గంధం వెదజల్లుతుంది. మురికి నీరు నిల్వ ఉండడంతో దోమలు పెరుగుతున్నాయి. టైఫాయిడ్, డెంగి, మలేరియా, డయేరియా వంటి వ్యాధులు వచ్చే అవకాశమున్నందున బయటి పదార్థాలు తీసుకోకూడదని వైద్యులు చెబుతున్నారు. ఇంట్లో చేసుకున్న వేడి ఆహారపదార్థాలను తీసుకోవాలని, కాచి చల్లార్చిన నీరు తాగాని సూచిస్తున్నారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాల్లో 500 వరకు రాఫిడ్ రెస్పాన్స్ టీమ్స్‌ను ఏర్పాటు చేశారు. పీహెచ్‌సీలు, జిల్లా, ఏరియా ఆసుపత్రుల్లో ప్రత్యేక బృందాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. ప్రజలకు అన్ని వేళలా వైద్య సేవలందేలా చూస్తున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటికెళ్లవద్దని మంత్రి హరీశ్‌రావు, జిల్లా కలెక్టర్లు శరత్, రాజర్షి షా, ప్రశాంత్ జీవన్ పాటిల్, ఎమ్మెల్యేలు విజ్ఞప్తి చేశారు. పట్టణాల్లో నాలాలు ఉప్పొంగి ప్రవహించడం, రోడ్లపై గుంతలు, మ్యాన్‌హోల్స్ నీటితో నిండిపోవడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశమున్నందున వాహనదారులు జాగ్రత్తలు పాటించాలి. చాలా చోట్ల కల్వర్టులు, రోడ్లపై వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుంది. నిర్లక్షంగా దాటే ప్రయత్నం చేయకూడదు. పిడుగుపాటుకు గురయ్యే అవకాశమున్నందున చెట్ల కింద ఉండకూడదు. విద్యుత్‌ఘాతం సంభవించే అవకాశమున్నందున రైతులు పొలాల వద్దకెళ్లకపోవడం మంచిదని విద్యుత్ అధికారులు సూచిస్తున్నారు. పాత ఇళ్లు కూలిపోతున్నాయి. కూలిపోయే ప్రమాదమున్న ఇళ్లను ఖాళీ చేయాలని అధికారులు కోరుతున్నారు. ఏవైనా శిథిలమైన గోడలు, ఇళ్లు ఉంటే వాటిని కూల్చేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తామని ప్రకటించారు. వ్యాధుల విషయంలో నిర్లక్షం చేయకుండా ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకోవాలని వైద్య ఆరోగ్య శాఖ కోరుతోంది.





నిండుతున్న చెరువులు, కుంటలు



నవతెలంగాణ-తొగుట

మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చెరువులు, కుంటలు నిండుతున్నాయి, కూడవెల్లి మండలం లోని వివిధ గ్రామాల పరిధిలో ఉన్న చెక్ డ్యాంలు దూకుతున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో మూడు రోజులు భారీగా వర్షాలు కురుస్తున్నాయి. మల్లన్నసాగర్ ముంపు గ్రామం వేములఘాట్ పరిధిలో ప్రారంభమవుతుంది. జప్తిలింగారెడ్డిపల్లి, లింగంపేట గ్రామ శివారులో మండల పరిధి ముగిసి మిరుదొడ్డి మండలంలో అలువాల, అందే గ్రామాల శివారు ప్రవేశిస్తుంది. కూడవెల్లి వాగు ప్రవాహం ప్రారంభం కావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సీఎం కేసీఆర్ చొరవతో మిషన్ కాకతీయ విజయవంతమై భూగర్భ జలాలు పెరిగాయని ఏఎంసీ చైర్మెన్ దోమల కొమురయ్య హర్షం వ్యక్తం చేశారు. గురువారం మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో కాన్‌గల్ పెద్ద చెరువు అలుగు పడుతుండడంతో కొబ్బరకాయ కొట్టి, పసుపు, కుంకుమ చల్లి పూజలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు కాగానే మొట్టమొదటగా మిషన్ కాకతీయ పథకాన్ని అమలు చేసి పూడిక మట్టితో నిండిన చెరువులను అభివృద్ధి చేశారని తెలిపారు. మిషన్ కాకతీయ పథకం పూర్తిగా విజయవంతమైందని అన్నారు. కార్యక్రమంలో మండల యువజన నాయకులు మరుపల్లి రమేష్ గౌడ్,గ్రామ యువ కార్యకర్తలు హరీష్, అక్షయ్, రిత్విక్, రాహుల్, నవీన్ తదితరులు పాల్గొన్నారు. జప్తి లింగారెడ్డిపల్లి సమీపంలోని తుంగ చెరువు నిండి అలుగు పారుతోంది.

నిండుకుండను తలపిస్తున్న చెరువులు





నవతెలంగాణ -గజ్వేల్

నాలుగు రోజులుగా కురుస్తున్న కుండపోత వర్షంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. వర్షం ఎంతో అవసరమైనా మొలక దశలో కొన్ని పంటలు మురిగిపోయే అవకాశం ఉంది. రాకపోకలకు ఇబ్బంది అవుతోంది. వర్షం భారీగా కురుస్తుండడంతో గజ్వేల్లో చాలా రోడ్లు జలమయమయ్యాయి. ఇంటి నుండి బయట పడాలంటే వీలు కావడం లేదు. గాలీదుమారానికి చెట్లు ఇరిగిపోయాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోంది. రాజీవ్ రహదారిపై వర్షం భారీగా కురవడంతో పొగ మంచులా మారింది. రాకపోకలకు ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో అనేక రోడ్లు వర్షం నీరుతో నిండిపోయి కనిపిస్తున్నాయి. పాండవుల చెరువులోకి నీరు చేరుతోంది. ఎర్రగుంట మీదుగా వర్షం నీరు పాండవుల చెరువులో చేరుతోంది. మల్లన్నసాగర్ కాలనీలో పలు ఇండ్లు ఉరుస్తున్నాయి. నిర్వాసితులు ఇబ్బందులకు గురవుతున్నారు. శిథిలమైన ఇండ్లు చాలా చోట్ల కూలుతున్నాయి. కాల్వల్లో మురుగు పేరుకుపోయి రోడ్లపై పారుతోంది.

నవతెలంగాణ-బెజ్జంకి: మూడు రోజులుగా ఎడతెరిపిలేకుండా కురుస్తున్న ముసురు రైతులకు కొంతమేర ఊరటనిచ్చింది. మంగళవారం రాత్రి నుంచి వాన కురుస్తోంది. జిల్లాలో కురిసిన వర్షానికి గురువారం మండలంలోని గాగీల్లపూర్, తోటపల్లి, దేవక్కపల్లి శివారులోని మోయతుమ్మెద వాగులో నీటిప్రవాహం పెరిగి వాగుపై నిర్మించిన చెక్ డ్యాంలు నీటితో నిండిపోయి జలకళను సంతరించుకున్నాయి. ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షాలకు వ్యవసాయ సాగు పనులు ఊపందుకున్నాయి.

నవ తెలంగాణ -దుబ్బాక: దుబ్బాకలో గత మూడ్రోజులుగా కురుస్తున్న వర్షాలతో పెంకుటిండ్లలో జీవనం కొనసాగిస్తున్న వారి పరిస్థితి ఆందోళనకరంగా మారింది. ఎప్పుడు ఏమవుతుందోనని బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. పురపాలిక కేంద్రంలోని 13వ వార్డులో నివాసం ఉంటున్న చెక్కపల్లి ఎల్లయ్య పెంకుటిల్లు బుధవారం రాత్రి కూలిపోయింది. ఎల్లయ్య కూలీ పని చేస్తూ భార్య, కొడుకుతో కలిసి ఇదే ఇంట్లో ఉంటున్నాడు. వర్షాలతో ఇల్లు కూలిపోవడంతో తాము నిరాశ్రయులమయ్యామని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

నవతెలంగాణ కొండపాక : రెండు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వర్షపు నీరు చెరువులలో చేరి నిండుకుండలా కనిపిస్తున్నాయి. పలు గ్రామాల చెరువులు మత్తడి దూకుతున్నాయి. కొండపాక మండలం దుద్దెడ నల్లచెరువు, మర్పడగ గుండ్ల చెరువు, తిప్పని కుంట తదితర చెరువులు మత్తటి దూకుతున్నాయి. కొండపాక మర్పడగ చెరువులు నిండుకుండలా దర్శనమిస్తున్నాయి. వర్షాలకు పలు గ్రామాల్లో ఇండ్లకు స్వల్ప నష్టం వాటిల్లింది. సిరసనగండ్ల గ్రామంలో రెండు, బందారంలో ఒకటి, ఖమ్మంపల్లిలో ఒక ఇంటికి స్వల్పంగా కూలిపోయాయి.

నవతెలంగాణ-నార్సింగి: గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు నార్సింగి మండలంలోని చెరువులు నిండు కుండలుగా మారాయి. వాగులు పొంగి పొర్లుతున్నాయి. మండల కేంద్రంలోని ఖాన్ తలాబ్ (కాముని చెరువు)లో భారీగా నీరు చేరింది. నార్సింగి నుండి మిర్జాపల్లి వెళ్ళే దారిలో ఉన్న గన్నేరువాగు పారుతోంది. గురువారం వాగు ప్రవహిస్తుండడంతో ప్రజలు వాగులో వలలు వేసి చేపలు వేటాడుతూ కనిపించారు. భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలు జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచిస్తున్నారు.















నవతెలంగాణ-రామచంద్రాపురం: రెండ్రోజులుగా కురుస్తున్న భారీ వర్షానికి రామచంద్రాపురం, భారతినగర్ డివిజన్లు మరియు తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని పలు వీధుల్లో భారీగా నీరు చేరి జలమయమయ్యాయి. రామచంద్రారెడ్డినగర్, మయూరినగర్, మల్లికార్జున్‌నగర్, బొంబాయి కాలనీ, ఎంఐజీ, ఎల్ఐజీ, తెల్లాపూర్ ప్రాంతాల్లో డ్రయినేజీలు నిండి రోడ్లపైకి నీరు పారుతున్నది. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతున్నది. ఎంఐజీ నుండి తెల్లాపూర్‌కి వెళ్లే దారిలో రైల్వే బ్రిడ్జి వద్ద నీరు భారీగా చేరడంతో ఆ దారిలో రాకపోకలు స్తంభించాయి. వర్షాల మూలంగా పాఠశాలలకు సెలవు ప్రకటించడంతో విద్యార్థులు ఇంటికే పరిమితమయ్యారు. ఉద్యోగస్తులు కార్మికులు తమ సంస్థలకు చేరుకోవడానికి నానా అవస్థలు పడ్డారు. జాతీయ రహదారిపై భారీ వర్షం మూలంగా ట్రాఫిక్ జామై కిలోమీటర్ల మేర నిలిచిపోయాయి. కార్పొరేటర్లు పుష్ప, సింధు పలు విధులలో పర్యటించి నీట మునిగిన ప్రదేశాలలో తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పలు ప్రాంతాల్లో విద్యుత్‌కి అంతరాయం కలిగింది. డ్రైనేజీ వ్యవస్థ లెవలింగ్ సరిగ్గా లేకపోవడంతో చాలా ప్రాంతాల్లో డ్రైనేజ్ పైప్ లైన్లు రోడ్లపైకి ప్రవేశించడమే కాకుండా ఇళ్లలోకి కూడా చేరుతున్నాయి. వర్షం ఇలాగే కొనసాగితే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు నెలకొన్నాయి. అధికారులు స్పందించి వెంటనే తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఏడుపాయల ఆలయం మూసివేత

నవతెలంగాణ -పాపన్నపేట : నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా వనదుర్గా ప్రాజెక్టు గురువారం పెద్ద ఎత్తున పొంగిపొర్లుతున్నది. ఆనకట్ట పైనుంచి పదివేల క్యూసెక్కుల నీరు కిందికి దూకుతూ ఏడుపాయల వన దుర్గ భవాని మాత ఆలయం ముందు నుండి పరవళ్లు తొక్కుతూ నిజాంసాగర్ వైపు పరుగులిడుతోంది. మంజీరా నది ఉధృతంగా ప్రవహించడంతో దేవాలయం ముందు జలకళ సంతరించుకొని కొంతమేర నీరు ఆలయం ముందుగల ధ్వజస్తంభం గద్దెను తాకుతూ ప్రవహిస్తోంది. దీంతో భక్తులు దేవాలయంలోనికి వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. దీని దృష్టిలో పెట్టుకొని ఉదయాన్నే ఏడుపాయల్లో మూలవిరాట్ అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించి ఆలయాన్ని ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేద పండితులు మూసి వేశారు. ఆలయ ఈవోశ్రీ సార శ్రీనివాస్, అర్చకులు, సిబ్బంది ఆధ్వర్యంలో గుడిని తాత్కాలికంగా మూశారు. వరద ఉధృతి తగ్గగానే అమ్మవారి ఆలయాన్ని పునప్రారంభిస్తామని ఈవోసార శ్రీనివాస్ వెల్లడించారు.

నవతెలంగాణ వెల్దుర్తి: మండల వ్యాప్తంగా మూడు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా వానలు పడుతున్నాయి. ఉమ్మడి మాసాయిపేట్ వెల్దుర్తి మండల వ్యాప్తంగా గురువారం భారీ వర్షాలతో హల్దీవాగు పరీవాహక ప్రాంతాల్లో చెక్ డ్యాములు నిండాయి. చెరువు, కుంటలు నిండుకుండను తలపిస్తున్నాయి. అలుగు పోసే వరకు నీళ్లు చేరుకున్నాయి. వాగులు వంకలు ఏరులై పారుతున్నాయి. అక్కడక్కడా వాగులు గండ్లు పడి పొలాల్లోకి నీళ్లు చేరాయి. నారుమళ్లు కొట్టుకుపోయి రైతులకు అపార నష్టాన్ని కలిగించాయి. పెంకుటిన్లు అక్కడక్కడా పాక్షికంగా కూలిపోయాయి. రైతులు వరి నాట్లు ముమ్మరంగా వేస్తున్నారు. లోతట్టు ప్రాంతాల్లో పొలాలకు, వాగులకు గండ్లు పడ్డాయి. వరి పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. మరో మూడు రోజులు వర్షాలు కురిస్తే వరి కుళ్లిపోయే ప్రమాదం ఉందని రైతులు అంటున్నారు.

నవతెలంగాణ హుస్నాబాద్ రూరల్: హుస్నాబాద్ మండలంలోని పందిళ్ళ గ్రామంలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఇండ్లు కూలిపోయాయి. గ్రామానికి చెందిన పూజారి రాజయ్య, తాడూరి కనకవ్వ ఇండ్లు కూలిపోగ, తాడూరి లింగం ఇల్లు పాక్షికంగా ధ్వంసం అయింది. గ్రామ సర్పంచ్ తోడేటి రమేష్ కూలిపోయిన ఇండ్ల స్థలాలను పరిశీలించారు. కూలిపోతున్న ఇంటి స్థలాల వద్ద ఉండవద్దని సూచించారు.

అనర్హులకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు

తహసీల్దార్, ఆర్ఐలపై అదనపు కలెక్టర్లకు ఫిర్యాదు



నవతెలంగాణ-మద్దూరు

దూళ్మిట్ట మండలం లోని జాలపల్లి గ్రామంలో కొంతమంది అనర్హులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పంపిణీ చేశారని, డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీలో స్థానిక జెడ్పీటీసీ, ఎంపీటీసీకి సమాచారం ఇవ్వని తహసీల్దార్ గోపాల్, ఆర్ఐ ఐలయ్యలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ సిద్దిపేట జిల్లా స్థానిక సంస్థల అదన కలెక్టర్లకు గురువారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మద్దూరు జెడ్పీటీసీ గిరి కొండల్ రెడ్డి. ఎంపీటీసీ చెట్కూరి కళ్యాణి కమలాకర్ యాదవ్ మాట్లాడుతూ గ్రామంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీకి జనవరి 2022లో గ్రామసభ ఏర్పాటు చేశారని, ఇందులో 16 ఇండ్లకు 32 మందిని ఎంపిక చేశారని, తుది జాబితా ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఎంపిక చేస్తామని రెవెన్యూ అధికారులు చెప్పారని గుర్తు చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వకుండా జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి ఆదివారం తన ఫామ్‌హౌస్‌లో కొంతమంది అనర్హులకు సైతం డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు పంపిణీ చేశారని ఆరోపించారు. గ్రామ సభలో ప్రజా ప్రతినిధులకు సమాచారం ఇవ్వకుండా తుది జాబితా అందించిన తహసీల్దార్, ఆర్ఐలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, జారీ చేసిన పట్టాలను రద్దు చేసి మళ్లీ గ్రామసభ నిర్వహించి అర్హులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు అందించాలని కోరారు. వార్డు సభ్యులు చెట్కూరి వెంకటేశ్వర్లు, నిరాజిత, మమత, లత, రమేష్, గ్రామస్తులు సాగర్ గౌడ్, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

కాలుష్యా ప్రాంతాన్ని సందర్శించిన ఆర్డీఓ



నవతెలంగాణ-జిన్నారం, ఐడీఏబొల్లారం

మండల పరిధిలోని పారిశ్రామిక ప్రాంతమైన ఖాజీపల్లి కాలుష్య ప్రాంతాన్ని సంగారెడ్డి రెవెన్యూ డివిజనల్ అధికారి రవీందర్ రెడ్డి గురువారం పరిశీలించారు. కాలుష్య పరిశ్రమల నుంచి వ్యర్థ రసాయ నాల పారబోత, ఇటీవల విచ్చలవిడిగా కాలుష్యపూరితమైన డ్రమ్ములను గుట్టు చప్పుడు కాకుండా పారబోయడం, తరచుగా ఈ ప్రాంతంలోనే కాలుష్యపూరితమైన వ్యర్థ రసాయనాలను ఎందుకు పారబోస్తున్నారనే విషయాలపై ఆరా తీశారు. కాలుష్య వ్యర్థ రసాయనాలను వదులుతున్న భూమి ఎవరికి చెందిందని వాకబు చేస్తారు. ఇష్టారీతిగా వ్యర్థాలను పారబోస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం కాలుష్యమయంగా మారిన జిల్లెల్ల వాగు ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కాజిపల్లి సర్పంచ్ చిట్ల సత్యనారాయణ, ఎంపీటీసీ ఆకుల భార్గవ్ తదితరులు ఈ ప్రాంతంలో కాలుష్య పరిశ్రమల నుంచి విడత రసాయనాల పారబోత విచ్చలవిడిగా జరుగుతోందని, గుట్టు చప్పుడు కాకుండా రసాయనాలను, రసాయన పూరితమైన డ్రమ్ములను తరచుగా పారబోస్తుండడం కాజిపల్లి వాసుల పాలిట శాపంగా మారిందని అధికారులకు వివరించారు. పరిశ్రమలు పై ప్రాంతంలో ఉండడం, గ్రామం కింది ప్రాంతంలో ఉండడంతో.. వర్షాలు పడే సమయాన్ని ఆసరాగా చేసుకుని రసాయన పరిశ్రమల వారు విచ్చలవిడిగా కాలుష్యాన్ని వెదజల్లుతున్నారంటూ వాపోయారు. కాలుష్య నియంత్రణ మండలి అధికార విభాగం ఎప్పటికప్పుడు వేగంగా స్పందించి తగిన నివారణ చర్యలు తీసుకోవాలని పిసికి అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం కాలుష్యంత్ర మండలి విభాగం ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ కుమార్ పాఠక్, స్థానిక సర్పంచ్ చిట్ల సత్యనారాయణ, ఎంపీటీసీ ఆకుల భార్గవ్, పలువురు స్థానికులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన మఠం భిక్షపతి

- భిక్షపతి పనితనంపై సంపూర్ణ విశ్వాసం ఉంది : ఎమ్మెల్సీ కవిత



నవతెలంగాణ -జోగిపేట

తెలంగాణ రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మెన్‌గా మఠం బిక్షపతి హైదరాబాద్ శక్కర్ భవన్‌లో గురువారం పదవీ బాధ్యతలు చేపట్టారు. రాష్ట్ర హెూం మంత్రి మహమ్మద్ అలీ, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, దేశపతి శ్రీనివాస్, రాష్ట్రమంత్రి ప్రశాంత్ రెడ్డి, ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ తదితరులు పూజా కార్యక్రమాలు చేపట్టిన అనంతరం కార్యాలయంలో పదవి బాధ్యతలు స్వీకరిస్తూ సంతకం చేశారు. ఈ సందర్భంగా వారు బిక్షపతికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఏర్పాటుచేసిన సభలో ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ.. బిక్షపతి చైర్మన్‌గా ఎన్నిక కావడం అభినందనీయమని.. ఆయన పనితనంపై తనకు సంపూర్ణ విశ్వాసం ఉన్నదన్నారు. తెలంగాణ బాగుకోసం జాగతి, బీఆర్ఎస్ పనిచేస్తున్నదన్నారు. బిక్షపతి నీతి, నిబద్ధతతో వచ్చిన వ్యక్తి అన్నారు. రాష్ట్రంలో పారదర్శకమైన విధానాలతో సీఎం కేసీఆర్ రూ.30 కోట్ల ఆదాయం ఉన్న శాఖను 150 కోట్ల ఆదాయానికి తీసుకువచ్చారన్నారు. దీనిని 1500 కోట్లకు పెంచాల్సిన బాధ్యత వారిపై ఉందన్నారు. ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ ఎంతో కీలకమైందన్నారు. కార్పొరేషన్ ఉన్నతికి కృషి చేయాలని చైర్మెన్, ఎండిలకు ఆమె సూచించారు. అదేవిధంగా వచ్చే ఎన్నికల్లో అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ విజయానికి కృషి చేయాలని బిక్షపతికి సూచించారు.

కార్మికులను మోసం చేస్తున్న నోవాటెక్ కంపెనీ

- ఆగ్రహించిన మహిళా కార్మికుల ఆందోళన
- నోవాటెక్ కంపెనీ ముందు బైఠాయించిన ధర్నా



నవతెలంగాణ వెల్దుర్తి

కార్మికులను మోసం చేస్తున్న నోవాటెక్ కంపెనీపై చర్యలు తీసుకోవాలని మహిళలు డిమాండ్ చేశారు. గురువారం నోవాటే కంపెనీ ముందు మహిళా కార్మికులు ఆందోళన చేపట్టారు. కంపెనీ ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. మహిళల ఆందోళనకు అఖిలపక్ష నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ నోవాటెక్ ఫీడ్ కంపెనీ యాజమాన్యం కంపెనీ కూలీలు కాకుండా వేరే కాంట్రాక్టర్‌కు అప్పగించడం సమంజసం కాదన్నారు. కొన్ని నెలల నుండి పరిశ్రమలో పని చేస్తున్న తమను ఇబ్బందులకు గురి చేస్తూ దినసరి కూలీలుగా పనులు చేయాలని ఇబ్బందులు పెడుతున్నట్లు తెలిపారు. అవసరమైతే పని చేయాలని, లేకుంటే పని మానివేయాలని యజమాని చెప్పడంతో కోపోద్రిక్తులైన మహిళా కార్మికులు నిరసన గళమెత్తారు. అఖిలపక్ష నాయకులు ఎంపీటీసీ కృష్ణారెడ్డి మాజీ సర్పంచ్ నాగరాజ్ మాజీ ఎంపీటీసీ సిద్ధిరాం గౌడ్ మండల సొసైటీ డైరెక్టర్ నర్సింలు మండల బిజెపి అధ్యక్షులు వేణుగోపాల్ కూలి మహిళలకు మద్దతు తెలిపారు. సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి కంపెనీ యజమాన్యంతో మాట్లాడారు. పది సంవత్సరాల నుండి కంపెనీలో పని చేస్తున్న వారి పొట్ట కొట్టకుండా యాజమాన్యమే వారికి వేతనం చెల్లించాలన్నారు. జీఎం హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో వాట్స్‌అప్లో శ్రీనివాస్ పవన్ లక్ష్మణులతో పాటు కూలీలు ఉన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్



నవతెలంగాణ సిద్దపేట కలెక్టరేట్

జిల్లాలో ప్రభుత్వ ఆస్పత్రుల భవనాల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ అధికారులను ఆదేశించారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, టీఎస్ఎంఎస్ఐడిసి, నిర్మాణ ఏజెన్సీలతో కలిసి జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు ఆదేశాల మేరకు జిల్లాలో నిర్మాణ దశలో ఉన్న పలు ప్రభుత్వ ఆసుపత్రులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలన్నారు. జిల్లా కేంద్రంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 1000 పడకల ప్రభుత్వ ఆసుపత్రి పనుల్లో అధిక మొత్తంలో కూలీలను సమకుర్చుకుని పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. సమావేశంలో టీఎస్ఎంఎస్ఐడిసి ఎండి కె చంద్రశేఖర్ రెడ్డి, సిఈ రాజేందర్ కుమార్, ఎస్ఈ సురేందర్ రెడ్డి నిర్మాణ ఏజెన్సీలు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

పండ్ల తోటలు, బిందు సేద్య పరికరాలకు రాయితీలు

నవతెలంగాణ-గుమ్మడిదల

గ్రామీణ ఉపాధి హామీ హార్టికల్చర్ ఉద్యానవన శాఖ ద్వారా పండ్ల తోటల పెంపకానికి, బిందు సేద్య పరికరాలకు ప్రభుత్వం ప్రోత్సాహక రాయితీలు అందిస్తున్నదని ఉద్యానవన శాఖ అధికారి శైలజ చెప్పారు. ప్రస్తుత పరిస్థితుల్లో డెంగ్యూ కరోనా లాంటి వైరస్ల వలన కలిగే అనర్థాల నుంచి సంరక్షించుకోవడానికి రోగ నిరోధక శక్తి గల డ్రాగన్ ఫ్రూట్, నేరేడు, సీతాఫలం, నిమ్మ తదితర పండ్లకు మార్కెట్లో డిమాండ్ ఉన్నదని.. కాబట్టి వాటిని సాగు చేయుటకు రాష్ట్ర ప్రభుత్వం రాయితీ అందిస్తున్నదన్నారు. బీర, సొర, కాకర, గోరుచిక్కుడు, టమాట, పచ్చిమిర్చి, దొండ, మునగ, తదితర కూరగాయ పంటలకు కూడా రాయితీలు ఉన్నాయన్నారు. రైతులకు ఉపాధి హామీ జాబ్ కార్డు ఉండి.. నీటి సౌకర్యం ఉన్న భూములు కలిగి ఉండాలన్నారు. ఐదు ఎకరాల లోపు ఉన్న షెడ్యూల్ కులాల చిన్న సన్నకారు రైతులు ఈ రాయితీలకు అర్హులన్నారు. అర్హులు, ఆసక్తి గల రైతులు ఈనెల 31లోగా ఆయా గ్రామాల పంచాయతీ కార్యాలయాల్లో గానీ, మండల వ్యవసాయ కార్యాలయంలో, మండల అభివృద్ధి కార్యాలయంలో గానీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.......

అందరూ అప్రమత్తంగా ఉండాలి

- అత్యవసరం అయితే తప్పా బయటకు రావొద్దు
- రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మెన్ చింతా ప్రభాకర్



నవతెలంగాణ-సంగారెడ్డి

ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నందున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరం అయితే తప్ప బయటకు రావొద్దని రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మెన్ చింతా ప్రభాకర్ ప్రజలకు సూచించారు. వర్షాలు పెరిగే అవకాశం ఉన్నదని వాతావరణ శాఖ తెలుపుతున్నందున.. రైతులు, ప్రజలు అప్రమతంగా ఉండి, విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్స్, విద్యుత్ వైర్లు వంటివి రైతులు తాకకుండా ఉండాలన్నారు. చిన్న పిల్లలను బయటకు వెళ్లకుండా తల్లిదండ్రులు గమనిస్తుండాలన్నారు. చెరువుల్లో చేపలు పట్టే వారు జాగ్రత్తగా ఉండాలన్నారు. రోడ్లపై వెళ్తున్న సమయంలో వాహనాలు అదుపు తప్పే ప్రమాదం ఉంటుందని జాగ్రత్తగా ఉండాలన్నారు. హెల్మెట్ తప్పకుండా ధరించాలన్నారు. ఉరుములు, మెరుపులు వచ్చే క్రమంలో చెట్ల వద్ద ఉండొద్దన్నారు. ముఖ్యంగా లోతట్టు ప్రాంత ప్రజలు జాగ్రత్తలు వహించాలన్నారు. ఏమైనా ఇబ్బందులు తలెత్తితే వెంటనే పోలీస్‌లకు సమాచారం ఇవ్వాలన్నారు.



తెలంగాణ రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి సంస్థ చైర్మెన్‌గా తన్వీర్ ప్రమాణ స్వీకారం

నవతెలంగాణ-జహీరాబాద్

తెలంగాణ రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి సంస్థ చైర్మెన్‌గా జహీరాబాద్ నియోజకవర్గానికి చెందిన మాజీమంత్రి, కీర్తిశేషులు మొహమ్మద్ ఫరీరుద్దీన్ తనయుడు మొహమ్మద్ తన్వీర్ గురువారం హైదరాబాద్‌లో ప్రమాణ స్వీకారోత్సవం చేశారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని జహీరాబాద్, ఝరాసంగం, న్యాల్కల్, కోహిర్, మొగుడంపల్లి మండలాలతో పాటు సదాశివపేట, సంగారెడ్డి, పటాన్చె రువుల నుంచి భారీ సంఖ్యలో కార్యకర్తలు అభిమానులు వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆర్థిక, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు, హోం మంత్రి మహమూద్ అలీ, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, రాష్ట్ర మౌలిక సదుపాయాల సంస్థ చైర్మెన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, జహీరాబాద్ శాసన సభ్యులు మానిక్ రావులు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వారితోపాటు మహమ్మద్ షకీల్, డీసీఎంఎస్ చైర్మెన్ శివకుమార్, ఢిల్లీ వసంత్, వై నరోత్తం, బిజి సందీప్, నామ రవికిరణ్, అల్లాడి నర్సింలు, అల్లాడి వీరేశం, ముత్యాల లావణ్య చందు, మహమ్మద్ తాంజీం, మహంకాళి శుభా, వైద్యనాథ్, వెంకటేశం, బి. సతీష్, జహంగీర్, అబ్దుల్లా, యూనివర్సిటీ, రాములు నేత, మహ మ్మద్ అక్రం, మంజుల కౌలాస్ ,షీలా రమేష్, మాణిక్యమ్మ, మంజుల వెంకట్ మోహన్ రెడ్డి, సయ్యద్ మహిఉద్దీన్, రామకృష్ణారెడ్డి, దశరథ్ రెడ్డి, పాండురంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బిక్షపతికి శుభాకాంక్షలు తెలిపిన చింతా ప్రభాకర్

నవతెలంగాణ-సంగారెడ్డి

హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మెన్‌గా బాధ్యతలు స్వీకరించిన మఠం బిక్షపతికి రాష్ట్ర హ్యాండ్లూమ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ చింతా ప్రభాకర్ పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మెన్ విజేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మాణిక్ ప్రభూ తదితరులు ఉన్నారు.



బిక్షపతికి శుభాకాంక్షలు తెలిపిన కౌన్సిలర్ నాగరాజు

నవతెలంగాణ-జోగిపేట

రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మెన్‌గా పదవి బాధ్యతలు చేపట్టిన మఠం బిక్షపతిని బీఆర్ఎస్ యువ నాయకులు, అందోల్ జోగిపేట మున్సిపల్ కౌన్సిలర్ కోరబోయిన నాగరాజు, రాష్ట్ర బీఆర్ఎస్ నాయకులు నీలం మధు ముదిరాజ్‌తో కలిసి పుష్ప గుచ్ఛం అందించి, శాలువాతో సన్మానించారు. గురువారం శంకర్ భవన్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి వారు వెళ్లి పదవి బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.



513 సంచుల పీడీఎస్ బియ్యం పట్టివేత

నవతెలంగాణ-జోగిపేట

అక్రమంగా తరలిస్తున్న 513 సంచుల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీన పర్చుకున్నట్టు జోగిపేట ఎస్సై సామాన్య నాయక్ తెలిపారు. సోమవారం ఉదయం బైపాస్ రోడ్డుకుండా పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా హైదరాబాద్ ప్రాంతానికి తరలిస్తున్నారన్న నమ్మదగిన సమాచారం మేరకు వాహన తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో బియ్యం తరలిస్తున్న లారీని సివిల్ సప్లై సిబ్బందితో కలిసి పట్టుకున్నట్లు ఎస్సై చెప్పారు. డిప్యూటీ తహసీల్దార్, సివిల్ సప్లై దినేష్‌రెడ్డి ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్ చవా భాస్కర్, హైదరాబాద్‌పై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు బియ్యంను ఎంఎల్ఎస్ పాయింటు గోడౌన్‌కు తరలించినట్టు చెప్పారు.



అధ్వానంగా మారిన బీటీ రోడ్లు

నవతెలంగాణ-ఝరాసంగం

మండల పరిధిలోని వివిధ గ్రామాల బీటీ రోడ్లు అధ్వానంగా మారాయని.. బంగారు తెలంగాణ అని చెప్పుకుంటున్న ఓ పైసల మంత్రికి, స్థానిక ఎమ్మెల్యేకు ఇవేమీ కనిపించడం లేదా అని బీహెచ్పీ జహీరాబాద్ నియోజకవర్గ ఇన్చార్జ్ సిద్దు రావణ్ ప్రశ్నించారు. మండల పరిధిలోని ఝరాసంగం నుండి మేదపల్లి, ఈదులపల్లి నుండి దిగ్వాల్ వరకు గల బీటీ రోడ్డు పూర్తిగా ధ్వంసమై ప్రమాదకర స్థాయికి చేరిందన్నారు. ఝరాసంఘం నుంచి రుక్మాపూర్ వరకు గోతులు ఏర్పడి ప్రయాణం చేయలేని స్థితికి రోడ్లు మారాయన్నారు. అదేవిధంగా వనంపల్లి గ్రామానికి కల్వర్టు లేక ఆ గ్రామ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. బొప్పాన్పల్లి, బోరేగావ్ రోడ్లు సైతం పాడయ్యాయన్నారు. ప్యారవరం గ్రామానికి వంతెన లేక కొన్నేండ్ల నుంచి ఆ గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నా స్థానిక ఎమ్మెల్యేకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఈ రోడ్లన్నింటికి నిధులు కేటాయించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బాబురావు, రాజు, అసెంబ్లీ సెక్రెటరీ రాహుల్, చిన్నఅరుణ్, యాదగిరి, జైపాల్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

తవ్వారు.. వదిలేశారు

- నాడు టెండర్ విషయంలో జాప్యం.. టెండర్ అయ్యాక మరింత ఆలస్యం
- మూడు గ్రామాల ప్రజలకు ఇబ్బందిగా రోడ్డు
- తరచూ ప్రమాదాలు
- వెంటనే పనులు పూర్తి చేయాలి : గ్రామస్తుల డిమాండ్



నవతెలంగాణ-ఝరాసంగం

జహీరాబాద్ టూ ఎల్గోయి వయా పొట్‌పల్లి గ్రామం వరకు బీటి రోడ్డు పునర్నిర్మాణ పనుల్లో భాగంగా.. ఎల్గోయి నుండి అల్గోల్ గ్రామం వరకు జేసీబీలతో ఎక్కడికక్కడ బీటీ రోడ్డును తవ్వేశారు. దీంతో పెద్దపెద్ద గుంతలు ఉండి.. రాకపోకలు కష్టంగా మారింది. దీనికితోడు గత ఐదు రోజుల నుంచి ఎడతెరిపిలేని భారీ వర్షాలు కురుస్తుండడంతో.. ఆ రోడ్డు మొత్తం చిత్తడిగా మారింది. అంతకుముందే తేలిన కంకరపై వాహనాలు నడపలేని పరిస్థితి నెలకొంది. ప్రతి రోజు వివిధ వ్యాపార కార్యకలాపాల నిమిత్తం జహీరాబాద్ పట్టణానికి వెళ్లే మూడు గ్రామాల ప్రజలు.. స్కూలు, కాలేజీలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బం దులు పడుతున్నారు. రోడ్డను మొత్తం తవ్వేసి.. నెలలు గడుస్తున్నా పూర్తి చేయకపోవడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల కోడ్ రాకముందే పనులు పూర్తి చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. లేని యెడల ఎన్నికలను పూర్తిగా బహిష్కరించి.. తమ గ్రామంలోకి ఏ ఒక్క రాజకీయ నాయకుడిని అడుగు పెట్టనివ్వబోమని హెచ్చరిస్తున్నారు.

టెండర్ అయ్యాక మరింత జాప్యం..

ఈ రోడ్డుకు మరమ్మత్తులు చేయాలని గత నాలుగేండ్ల నుంచి పొట్‌పల్లి గ్రామస్తులు తరచూ రోడ్డుపై బైఠాయించి ధర్నాలు చేస్తున్నారు. అయినా అధికారులు, ప్రజాప్రతిధుల్లో చలనం లేదు.. దీంతో జహీరాబాద్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యేకు సైతం వినతి పత్రాన్ని అందజేశారు. అయినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. తమ గ్రామ ప్రధాన సమస్య అయిన రోడ్డు నిర్మాణ పనులను పరిష్కరించకపోతే వచ్చే సాధారణ ఎన్నికలను సైతం బహిష్కరిస్తామని నిక్కట్టుగా గ్రామస్తులంతా ఏకతాటి పైకి వచ్చి హెచ్చరించారు. అంతేకాకుండా ఏ ప్రజా ప్రతినిధులను గ్రామంలో ప్రచారాన్ని చేయనివ్వమన్నారు. దీంతో గత సంవత్సరం టెండర్ల ప్రక్రియ చేపట్టారు. గత మే 31న ఎస్‌డీఎఫ్ నిధుల కింద 1.70 (కోటి డెబ్బై లక్షల) రూపాయలతో రోడ్డు పనులకు ఎమ్మెల్యే మాణిక్‌రావు, ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మెన్ శివకుమార్, సీడీసీ చైర్మెన్ ఉమాకాంత్ పాటిల్‌తో శంకుస్థాపన చేశారు. దాదాపు ఈ పనులను ప్రారంభించి రెండు నెలలు పూర్తవుతున్నా.. రోడ్డు పనులు ముందుకు సాగడం లేదు. గతంలో టెండర్ విషయంలో జాప్యం చేశారని.. టెండర్ అయ్యాక మరింత జాప్యం చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. దీంతో మూడు గ్రామాల ప్రజలు అధికారులు, కాంట్రాక్టర్లు, ప్రజాప్రతినిధులు కుమ్మక్కయ్యారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

వర్షాలు తగ్గగానే పనులను ప్రారంభిస్తాం

జహీరాబాద్ టూ ఎల్గోయి వయా పొట్‌పల్లి గ్రామం వరకు రోడ్డు పనులను ప్రారంభించాం. గ్రామ సమీపంలో సీసీరోడ్డు వేయాల్సి ఉంది. ఈ తవ్విన రోడ్డు పై కంకర వేసి డాంబర్ వేయాల్సి ఉంటుంది. డాంబర్ వేయాలంటే వాతావరణం పొడిగా ఉండాలి. కాబట్టి వర్షాలు తగ్గగానే రోడ్డు పనులను ప్రారంభించి త్వరలో పూర్తి చేస్తాం. రుక్మాపూర్ టు సిద్ధాపూర్ వరకు 1 కిలోమీటర్ దూరం పనులు పూర్తయ్యాయి. వర్షాల కారణంగానే పనులను ఆపడం జరిగింది. రుక్మాపూర్ టు చిలేపల్లి తండా వరకు 3 కిలోమీటర్ల దూరంలో పనులు పూర్తయ్యాయి. మిగిలిన కొంత దూరంలో ఆ రోడ్డు నిమ్జ్ పరిధిలో ఉంది కాబట్టి దానిని మేము చేయలేం. తిరిగి ఆ పనులను నిమ్జ్ అధికారులు ఎప్పుడు మా శాఖకు అప్పగిస్తే అప్పుడు పనులను పూర్తి చేస్తాం.

– క్రిష్ణ, ఝరాసంగం పీఆర్ఏఈ

త్వరగా రోడ్డు పనులు పూర్తి చేయాలి

రోడ్డును తవ్వి దాదాపు రెండు నెలలు కావస్తున్నా.. పనులను పూర్తి చేయట్లేదు. మా ఊరి నుంచి జహీరా బాద్ పట్టణానికి వెళ్లేందుకు చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. వర్షాలు కురుస్తుండడంతో రోడ్డుపై గుంతల్లో నీళ్ళు నిలిచి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. తేలిన కంకరపై కనీసం రూలర్ కూడా తింపడం లేదు. అధికారులు స్పందించి త్వరలో రోడ్డు పనులను పూర్తి చేయాలి.

– బాలరాజ్, పొట్టిపల్లి



విపత్తుల సమయంలో ఎన్‌డీఆర్‌ఎఫ్ పాత్ర కీలకం

- విపత్తులపై 15 రోజులపాటు అవగాహనా కార్యక్రమాలు
- అదనపు కలెక్టర్ బి.చంద్రశేఖర్

నవతెలంగాణ-సంగారెడ్డి

విపత్తులు సంభవించినప్పుడు ఎన్‌డీఆర్ఎఫ్ (నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్) నిర్వర్తించే పాత్ర ఎంతో కీలకమైనదని అదనపు కలెక్టర్ బి.చంద్రశేఖర్ అన్నారు. ఎన్‌డీఆర్ఎఫ్ విజయవాడ 10వ బెటాలియన్ ఇన్‌స్పెక్టర్ ముఖేష్ కుమార్ ఆధ్వర్యంలో జిల్లాలో 15 రోజులపాటు వివిధ ప్రాంతాల్లో ప్రజలు, యువత, విద్యార్థులు, ఉద్యోగులకు విపత్తులు సంభవించినప్పుడు ఏవిధంగా కాపాడుకోవాలన్న అంశంపై అవగాహన కల్పించనున్నట్టు తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులు, ఎన్‌డీఆర్ఎఫ్ బృందంతో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ప్రకృతి వైపరీత్యాలు, మానవ తప్పిదాల వల్ల వివిధ రకాలైన విప త్తులు సంభవించినప్పుడు ఎలా స్పందిచాలి, అప్పటికప్పుడు ప్రాణ నష్టం జరగకుండా ఏ విధంగా కాపాడాలి, ముందస్తు తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలపై ఎన్‌డీఆర్ఎఫ్ టీమ్ ప్రజలకు అవగాహన కల్పిస్తారన్నారు. ముఖ్యంగా పేలుళ్ల సంభవించినప్పుడు, ప్రమాదకర రసాయనాలు విడుదలైన సందర్భాల్లో ఎలా వ్యవహరించాలి, ప్రమాదాల్లో చిక్కుకున్న వారిని ఎలా కాపాడాలి, ప్రమాదం జరగకుండా ముందస్తు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తారన్నారు. మాక్‌డ్రిల్ ప్రదర్శనలు నిర్వహించి అవగాహన కల్పించ నున్నట్టు పేర్కొన్నారు. అధిక వర్షాలతో జిల్లాలో ఎలాంటి సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని అధికా రులకు సూచించారు. గజ ఈతగాళ్లకు సంబంధించిన వివరాలను మున్సిపల్ కమిషనర్, ఆయా తాసిల్దారులు, ఎంపీడీవోలకు అందజేయాలని మత్స్యశాఖ అధికారికి సూచించారు. ప్రమాదాలు, విపత్తులు జరిగినప్పుడు సాధారణ పౌరులు కూడా తమవంతు బాధ్యతగా తక్షణమే స్పందించాలని.. పోలీస్, అగ్నిమాపకశాఖలకు సమాచారం అందించాలన్నారు.

అదనపు కలెక్టర్ (రెవిన్యూ) మాధురి మాట్లాడుతూ గతంలో జిల్లాలో జరిగిన పలు అనుభవాలను దృష్టిలో పెట్టుకోవాలన్నారు. ముఖ్యంగా జిల్లాలో ఎక్కువగా సంభవించే వైపరీత్యాలను ఎదుర్కోవడానికి స్థానికంగా ఏం చేయాలన్నది ప్రణాళికతో ఉండాలన్నారు. అగ్ని ప్రమాదాలు, హెవీ రేన్స్, ఫ్యాక్టరీలలో కెమికల్ ప్రమాదాలు సంభవించినప్పుడు వారి సహకారంతో ప్రజలను కాపాడాలన్నారు. జరగబోయే ప్రమాదాల గురించి ప్రజలను అప్రమత్తం చేయాలని, 15 రోజులపాటు నిర్వహించు ఆయా కార్యక్రమాలు అందరి సమన్వయంతో సమర్థవంతంగా నిర్వహించాలని మాధురి కోరారు. ఈ సమావేశంలో డిఆర్‌ఓ నగేష్, డిఇఓ, మున్సిపల్ కమిషనర్, తార డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్, పోలీస్, ఫైర్, యూత్ వెల్ఫేర్, మెప్మా వైద్య ఆరోగ్యశాఖ, పంచాయతీ, ఎంప్లాయిమెంట్, అటవీ శాఖల అధికారులు, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్, తహసీల్దారులు, ఎంపీడీవోలు, జైల్ సూపరింటెండెంట్, ఎన్‌డీఆర్ఎఫ్ బృందం పాల్గొన్నారు.



జిల్లాలో ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం అనుమతి

ఆసక్తి గల రైతులు దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ-జోగిపేట

సంగారెడ్డి జిల్లాలో ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని అందోల్ నియోజకవర్గ ఉద్యాన పట్టు పరిశ్రమ శాఖ అధికారి డి.కీర్తి కృష్ణ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అందులో భాగంగా గోద్రెజ్ ఆగ్రోవేట్ కంపెనీకి సంగారెడ్డి జిల్లాలో పామ్ ఆయిల్ తయారీ కంపెనీ మొదలు పెట్టడానికి అనుమతిని కూడా ఇచ్చిందన్నారు. 2022-23కి గాను సంగారెడ్డి జిల్లాకు ఐదువేల ఎకరాలను లక్ష్యంగా కేటాయించిందన్నారు.

రాయితీ వివరాలు..

ఆయిల్ పామ్ మొక్కలను సబ్సిడీలో సరఫరా చేయడం, మొక్కలు పెట్టుకునే రైతులకు డ్రిప్ సబ్సిడీలో ఇవ్వడం, నాలుగేండ్ల వరకు అంతర పంట వేసుకోవడానికి సబ్సిడీ ఇస్తారన్నారు. దరఖాస్తుతో పాటు పట్టా పాస్‌బుక్, బ్యాంకు పాస్‌బుక్, ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీ లు, 3 పాసుపోర్టు సైజు ఫోటోస్‌ను జత చేయాలన్నారు. ఆసక్తి గల రైతులు సంబంధిత ఉద్యాన మరియు పట్టు పరి శ్రమ శాఖ అధికారిని గాని, వ్యవసాయ విస్తరణ అధికా రి, మండల వ్యవసాయ అధికారిని గానీ సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు 7997725271నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

వైద్యారోగ్య సిబ్బంది అలర్ట్‌గా ఉండాలి

- జిల్లాలో 285 రాపిడ్ రెస్పాన్స్ టీమ్స్ ఏర్పాటు
- జిల్లా వైద్య అధికారి గాయత్రీ దేవి

నవతెలంగాణ-సంగారెడ్డి

కంట్రోల్ రూం నెంబర్లు..	
డీఎంఅండ్‌హెచ్‌ఓ	9494851165
సదాశివపేట్	9440426531
జహీరాబాద్	9010654984
నారాయణఖేడ్	9493935577

జిల్లాలోని వైద్య ఆరోగ్య సిబ్బంది అలర్ట్‌గా ఉండాలని జిల్లా వైద్య అధికారి గాయత్రీ దేవి సూచించారు. జిల్లాలో 285 రాపిడ్ రెస్పాన్స్ టీమ్స్ ఏర్పాటు చేశామన్నారు. భారీ వర్షాలు కురుస్తున్న సందర్భంగా జిల్లాలోని వైద్య ఆరోగ్య అధికారులతో గురువారం అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. వైద్య ఆరోగ్య సిబ్బంది అలర్ట్‌గా ఉండాలని.. తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రాపిడ్ రెస్పాన్స్ టీమ్స్‌తో పాటు.. సబ్ సెంటర్ లెవెల్, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర, డివిజన్ లెవెల్ టీమ్స్‌ను ఏర్పాటు చేశామ న్నారు. డిస్ట్రిక్ లెవెల్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఇది 24 గంటలు పని చేస్తుందన్నారు. యాంటీ స్నేక్ వీనం అన్ని హాస్పిటల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉన్నా యన్నారు. గర్భవతులందరికీ అత్యవ సర సమ యంలో అన్ని మందులు కూడా అందు బాటులో ఉంచడం జరిగింద న్నారు. హాస్పిటల్‌లో ఆర్ఎంఓ నెంబర్లను ప్రతి ఆశా కార్యకర్తకు తెలియజేయాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారుల ందరూ సాయంత్రం 6 గంటల వరకు ఓపి చూడాలని సూచనలు ఇచ్చారు. ఉప కేంద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అన్ని హాస్టల్స్ లోని పిల్లలందరినీ ఏఎన్ఎం, మెడికల్ ఆఫీసర్ తప్పక చెక్ అప్ చేయాల న్నారు. మెడికల్ ఆఫీసర్ పంచాయతీ సెక్రెటరీలతో కలిసి గ్రామం లోని పరిసరాలను పరిశీలి ంచాలని.. లీకేజీల ను, మురుగు కాలువలను ఎప్పటికప్పుడు పంచాయతీ రాజ్ సిబ్బందితో క్లీన్ చేయించాలని ఆదేశిం చారు. ఎక్కడైనా ఏమైనా కేసులు వచ్చినప్పుడు వెంటనే హెల్త్‌క్యాంపులు ఏర్పాటు చేసి తగుచర్యలు తీసుకోవాలన్నారు.

ఇంటి ముందున్న ర్యాంపులను తొలగించొద్దు

నవతెలంగాణ-రామచంద్రాపురం

భారతినగర్ డివిజన్ పరిధిలోని ఎంఐజి కాలనీలో భేల్ అధికారులు గురువారం ఇండ్ల ముందు ఉన్న ర్యాంపులను తొలగించారు. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ సింధూ ఆదర్శరెడ్డి ఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని పరిశీలించారు. వెంటనే బెల్ అధికారులకు ఫోన్‌చేసి ర్యాంపులను కూలగొట్టద్దని, కాలనీవాసులను భయభ్రాంతులకు గురి చేసి, అక్రమంగా పడగొట్టడం ఆపాలని కోరారు. కాలనీవాసులకు అండగా నిలిచి అధైర్యపడకూడదన్నారు. సమస్య పరిష్కారానికి త్వరలో ఎంపీ, ఎమ్మెల్యే లతో కలిసి భేల్ ఈడి దృష్టికి తీసుకెళ్తామన్నారు. అనంతరం ఇక్రిశాట్ ఫెన్సింగ్ ఏరియాలో పోచమ్మ గుడి వద్ద జరిగిన బోనాల ఉత్సవాల్లో కార్పొరేటర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు బూన్, యూత్ అధ్యక్షుడు నర్సింహ, వార్డ్ మెంబర్ తిలవాత్, సంపత్ గౌడ్, చిన్న, రాకేష్, రాములు, శ్రీలత, శ్రీదేవి, స్వరూప, కాలనీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-సంగారెడ్డి

గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించి.. సమ్మెను విరమింపజేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.యాదగిరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంగారెడ్డి మండలంలో పనిచేస్తున్న గ్రామపంచాయతీ కార్మికుల సమావేశాన్ని గురువారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ.. గత 15 రోజుల నుండి గ్రామపంచాయతీ సిబ్బంది సమ్మె చేస్తుంటే ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. వేతనాలు పెంచకుండా పని భారం పెంచడానికి జీవో నెంబర్ 51ని రూపొందించి ఒకే కార్మికుడు అనేక పనులు చేయాలనే మల్టిపర్పస్ విధానాన్ని ప్రవేశ పెట్టడం సరికాదన్నారు. గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మెలో గొంతెమ్మ కోర్కెలు లేవని.. న్యాయం, ధర్మం నీతి మాత్రమే ఉందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాల అమలు కోసమే నేడు సమ్మె జరుగుతున్నదన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం జీపి జేఏసీని చర్చలకు ఆహ్వానించి సమస్యలు పరిష్కరించి సమ్మెను విరమింప చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ యూనియన్ నాయకు లు బిక్షపతి, రాజు, మల్లేశం, రాజయ్య, సాయిలు, ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.



రైతుబీమా చెక్కులు అందజేత



నవతెలంగాణ-కల్హేర్

మండలంలోని కృష్ణాపూర్ గ్రామానికి చెందిన లచ్చవ్వ, మెట్టుకుండాతాండా గ్రామానికి చెందిన విట్టల్ నాయక్ అనే రైతులు ఇటీవల మృతిచెందారు. వారికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి రైతుబీమా పథకం కింద ఒక్కొక్కరికి రూ.5 లక్షల మంజూరయ్యాయి. ఇందుకు సంబంధించిన చెక్కులను ఎంబీఆర్ సంస్థ చైర్మెన్, బీఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకులు మహారెడ్డి రోషన్‌రెడ్డి స్థానిక సర్పంచ్ కిష్టారెడ్డి, నియోజకవర్గ ఆత్మ చైర్మెన్ రామ్‌సింగ్‌తో కలిసి లబ్దిదారుల ఇంటికి నేరుగా వెళ్లి గురువారం అందజేశారు. ఈ సందర్భంగా రోషన్‌రెడ్డి మాట్లాడుతూ.. కుటుంబ యజమానిగా ఉన్న రైతు మరణానంతరం అతని కుటుంబ సభ్యులు ఆర్థికంగా ఇబ్బందులు పడొద్దని గొప్ప ఆలోచనతో సీఎం కేసీఆర్ రైతుబీమా పథకం తీసుకువచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భూమ్‌రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

మండల కేంద్రమైన కల్హేర్ గ్రామానికి చెందిన గుమ్మడి కిష్టయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న మహారెడ్డి రోషన్‌రెడ్డి గురువారం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని భరోసానిచ్చారు. ఆయన వెంట నారాయణఖేడ్ ఆత్మ చైర్మన్ రామ్ సింగ్, కిష్టాపూర్ సర్పంచ్ కృష్ణారెడ్డి, స్థానిక సర్పంచ్ లక్ష్మి బాలయ్య, ఎంపీటీసీ సంగప్ప, కిష్టాపూర్ ఉపసర్పంచ్ ఈశ్వర్ తదితరులు ఉన్నారు.

మల్పరడితాండాకు రోడ్డు వేయాలంటూ ధర్నా



నవతెలంగాణ-నారాయణఖేడ్

మండలంలోని అల్లాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో గల మల్పరడితాండాకు రోడ్డు వేయాలని తాండవాసులతో కలిసి లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రకాష్ రాథోడ్ బుధవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మల్పరడితాండాకు వెళ్లే దారి పూర్తిగా దెబ్బతినడంతో.. రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. తాండా ప్రజలు గ్రామానికి వెళ్లాలంటే.. ట్రాక్టర్ సాయంతో వెళ్లాల్సిన దుస్థితి నెలకొన్నదన్నారు. తాండాలో ఎవరికైనా ప్రమాదం జరుగుతే అంబులెన్స్ కూడా వచ్చే పరిస్థితి లేదన్నారు. వర్షం వస్తే చాలు చిన్న పిల్లలు స్కూల్‌కి వెళ్లలేకపోతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రోడ్డు సదుపాయం కల్పించాలని డిమాండ్ చేసారు. అలాగే నారాయణఖేడ్ నియోజకవర్గంలోని ప్రతీ గిరిజన కుటుంబానికి రూ.పది లక్షల సాయాన్ని గిరిజన బంధు కింద అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షులు శ్రీనివాస్ నాయక్, వాసు,శ్రీనివాస్, వినోద్ నాయక్ నందుసింగ్, అనిల్, బాబు నాయక్, మారుతీ నాయక్, భీమ్లా నాయక్, లాలసింగ్, శివాజీ బన్సీలాల్, ధర్మీబాయి, తాండా మహిళలు పాల్గొన్నారు.

పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయాలి

- శిథిలావస్థ ఇండ్లలో ఉన్న వారిని వెంటనే తరలించాలి
- టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలి
- సీపీఐ(ఎం) ఆందోల్ నియోజకవర్గం డి. విద్యాసాగర్



నవతెలంగాణ-జోగిపేట

గత మూడ్రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల పాత ఇండ్లలో నివసిస్తున్న పేద ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని.. శిథిలావస్థ ఇండ్లల్లో ఉన్న వారిని వెంటనే పునరావాస కేంద్రాలకు తరలించాలని సీపీఐ(ఎం) ఆందోల్ నియోజకవర్గ కన్వీనర్ విద్యాసాగర్ అన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. వర్షాలకు ఇబ్బందులు పడుతున్న ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండి.. వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలన్నారు. ఇబ్బంది పడుతున్న పేద ప్రజలకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలన్నారు. ఇల్లు కూలిపోయిన వారికి వెంటనే కేంద్రాలకు తరలించి తక్షణ సాయం అందించాలన్నారు. వర్షాల వల్ల అనేక గ్రామాల్లో చెరువులు కుంటలు రహదారులు నీళ్లతో దృక్బంధం అయినాయని ప్రమాదకర స్థలాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి తగు చర్యలు తీసుకోవాలని వర్షాలకు నష్టపోయిన పేదలను అన్ని రకాల ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు ఆందోల్ నియోజకవర్గం లోని అన్ని మండలాలలో చాలా ఇండ్లు కూలిపోయినాయని ఒకపక్క కూలిపోయిన ఇంకోపక్క ప్రజలు అలాగే ఇంట్లో ఉంటున్నారని అలాంటి పేద ప్రజలను ప్రభుత్వం ఆదుకోవాలని టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేసి అత్యవసర సేవలు ప్రజలకు అందుబాటులో ఉంచాలని అన్నారు ఈ సమావేశంలో నరేష్ మాణిక్యం రాములు తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

మెదక్ జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని

నవతెలంగాణ-రేగోడ్ : ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని మెదక్ జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శని అన్నారు. గురువారం సాయంత్రం రేగోడు మండలంలోని తాటిపల్లి గ్రామంలో సీసీ కెమెరాలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒక్క సీసీ కెమెరా వందమంది పోలీసులతో సమానమన్నారు. సీసీ కెమెరాలు ఉంటే నేరాలను నియంత్రించవచ్చన్నారు. అదేవిధంగా ప్రతి గ్రామంలో గ్రామస్తులు అందరూ ముందుకు వచ్చి సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అల్లాదుర్గం సిఐ జార్జ్, ఎస్ఐ సత్యనారాయణ పోలీస్ సిబ్బంది ఉన్నారు.

కలెక్టర్‌ను కలిసిన చిన్న శివునూర్ సర్పంచ్

నవతెలంగాణ-చేగుంట



చేగుంట మండలం చిన్న శివనూర్ గ్రామ సర్పంచ్ కొటారి అశోక్ గురువారం మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షిషాను కలెక్టర్ కార్యాలయంలో కలిశారు. గ్రామంలో గ్రామ పంచాయతీ భవనం, అలాగే అంగన్వాడీ భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు అశోక్ వినతి పత్రం అందజేశారు.

వర్షాల దృష్ట్యా కరెంట్ పట్ల జాగ్రత్తగా ఉండాలి

మండల ట్రాన్స్‌కో ఏఈ అహ్మద్ అలీ

నవతెలంగాణ- కొల్చారం



భారీ వర్షాల కారణంగా కరెంట్ పట్ల మండల ప్రజలు జాగ్రతలు పాటించాలని విద్యుత్ శాఖ మండల ట్రాన్స్‌కో ఏఈ అహ్మద్ అలీ పేర్కొన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వర్షాకాలంలో కరెంటు స్తంభాలను లేదా వాటికి దగ్గర ఆనుకుని ఉన్నవాటికి ప్రజలు దూరంగా ఉండాలని సూచించారు. అలాగే కరెంటు వైర్లు, ఇళ్లలోని తీగలు, ఇనుప స్తంభాలను, కరెంటు మోటార్లు, స్టార్టర్లు, కరెంటు పైపులు, ఇతర కరెంటు సంబంధించి ఏదైనా పరికరాలకు దూరంగా ఉండాలన్నారు. ఏదైనా విద్యుత్ సమస్య ఏర్పడితే వెంటనే సంబంధిత విద్యుత్ అధికారులను లేదా విలేజ్ లైన్ మేన్‌లకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కరెంటు పట్ల జాగ్రత్తగా వ్యవహరించి కరెంటు ప్రమాదాలను నివారించాలని కోరారు.

బీఎల్‌ఓలు విధులు సమర్థవంతంగా నిర్వర్తించాలి

జిల్లా కలెక్టర్ రాజర్షి షా

నవతెలంగాణ-మెదక్



బీఎల్‌ఓలు విధులు సమర్థవంతంగా నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా పేర్కొన్నారు. గురువారం పురపాలక పురపాలక శాఖ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి మాస్టర్ శిక్షకులచే, ఏర్పాటు చేసిన బూత్ స్థాయి అధికారులు, ఫోటో ఎలక్టోరల్ రోల్ స్పెషల్ సమ్మరి రివిజన్-2023పై శిక్షణ, అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని సమర్థవంతమైన, స్పష్టమైన ఎలక్టోరల్ రోల్ చక్కగా తయారు చేయాలన్నారు. పారదర్శకమైన ఎన్నికల జాబితా తయారు చేయాలని, ఓటర్ల జాబితాలో మార్పులు చేయడంలో జాగ్రత్త వహించాలని సూచించారు. ఇంటింటి సర్వే ద్వారా ఓటర్ల జాబితాను నిర్ధారించాలని, గరుడ (బిఎల్ఓ) యాప్‌లో వివరాల నమోదు సక్రమంగా జరిగేలా చూడాలని, అందరూ బూత్ స్థాయి అధికారులు గరుడ యాప్‌ను ఉపయోగించే విధంగా చూడాలని ఆయన తెలిపారు. సమ్మరి రివిజన్‌లో లోటుపాట్లు సరిదిద్దుకొని ఏ దశలోను తప్పిదాలకు తావులేకుండా ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ఒక బూత్ లో 1500 కన్నా ఎక్కువ ఓటర్లు వున్నా , 2 కిలోమీటర్ల దూరం పోలింగ్ స్టేషనలు వున్నా కొత్త పోలింగ్ స్టేషన్ అనుమతి కోసం ప్రతిపాదనలు పంపి అనుమతి తీసుకుంటామని తెలిపారు. చనిపోయిన ఓటర్ల విషయంలో ఖచ్చితంగా మరణ ధృవీకరణ పత్రాన్ని పొంది, కుటుంబ సభ్యుల ద్వారా వాకబు చేసిన తరువాతే ఓటరు జాబితా నుంచి వివరాలను కచ్చితంగా తొలగించాలన్నారు. బీఎల్‌ఏ , సూపర్ వైజర్లు పరిశీలించి అసలైన ఓటర్ పేర్లు తొలగిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అనాథలు, ఒంటరి, కూలీ కోసం ఊరురూ తిరిగే వారి వివరాలను కూడా సేకరించి వారి స్థిర చిరునామా ఆధారంగా ఓటరుగా నమోదు చేయాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరిని ఓటరుగా నమోదు చేయాలని, పోలింగ్ కేంద్రం పరిధిలో ఓటరుగా ఉన్న ప్రతి ఒక్కరి ఫోటో, వివరాలు సరిగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ అంబాదాస్ రాజేశ్వర్, మెదక్ తహశీల్దార్ శ్రీనివాస్, బిఎల్ఎలు, సూపర్ వైజర్లు, బిఎల్ఓలు, ఎన్నికల సిబ్బంధి తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ఉపాధి హామీ పథకం 2వ విడత సామాజిక తనిఖీ

నవతెలంగాణ-నార్సింగి



మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం 2వ విడత సామాజిక తనిఖీ నిర్వహించారు. నార్సింగి ఎంపిడిఓ ఆనంద మేరీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రిసైడింగ్ అధికారిగా అదనపు ప్రాజెక్ట్ డైరెక్టర్ వీరోజా వ్యవహరించారు. ఈ సందర్భంగా మండలంలోని 9 గ్రామ పంచాయితీలలో జరిగిన ఉపాధి హామీ పనులపై లెక్కల తనిఖీ చేశారు. లెక్కల తనిఖీ అనంతరం ప్రిసైడింగ్ అధికారి విరోజ మాట్లాడుతూ మండలంలోని అన్ని 9 గ్రామ పంచాయితీల్లో ఉపాధి హామీ పనులు చక్కగా నిర్వర్తించారని ఆమె పేర్కొన్నారు. కొన్ని చోట్ల చిన్న సమస్యలు వచ్చాయని ఇక ముందు ఎలాంటి సమస్యలు రాకుండా చూసుకోవాలని, మస్టర్ల నిర్వహణలో జాగ్రత్త వహించాలని సూచించారు. రికవరిలు రూ.44,140ల మేర జరిగాయని, లాప్స్ ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయితీ కార్యదర్శులు, డి.ఎ ల నుంచి రూ.7వేల జరిమానా రూపంలో వేయడం జరిగిందన్నారు. మరో విడత తనిఖీ లోపు లెక్కలలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ, ప్రిసైడింగ్ అధికారిలతో పాటు జిల్లా విజిలెన్స్ అధికారి శ్రీహరి, అంబుడ్స్మన్ అధికారి ప్రభాకర్, క్వాలిటీ కంట్రోల్ అధికారి రమాకాంత్, ఎంపీఓ సతీష్, ఎస్.ఆర్.పీ హెడ్ బాలు, ఎంపీటీసీ సత్యనారాయణ, గ్రామాల పంచాయితీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, గ్రామాల సర్పంచ్‌లు, సామాజిక తనిఖీ టీమ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-నిజాంపేట



మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై శ్రీనివాస్ రెడ్డి అన్నారు. నిజాంపేట మండలంలో మూడు రోజులుగా ముసురుతో కూడిన వర్షం కురుస్తున్నందున ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. గ్రామాలలో ఉన్న పాత ఇండ్లలోఎట్టి పరిస్థితుల్లో ఉండరాదన్నారు. ఈ వర్షానికి నానిన గోడలు కూలిపోయే అవకాశం ఉంటుందని అలాంటి ఇండ్లలో నివాసం ఉండకపోవడమే మంచిదన్నారు. అదేవిధంగా ఈ వర్షాలకు వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. బోరు బావుల వద్ద కరెంటు స్టార్టర్ల వద్ద తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చెరువులలో నీరు చేరుతుండడంతో ఈత రానివారు చెరువులలోకి వెళ్ళకూడదన్నారు

నవతెలంగాణ-చేగుంట : గత మూడు రోజుల్లో కురుస్తున్న వర్షాల కారణంగా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని



చేగుంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నవీన్ కుమార్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత మూడు రోజులుగా వర్షాలు కురుస్తున్నందున పెంకుటిల్లు, రేకుల ఇల్లు, గుడిసెల్లో నివాసముంటున్న ప్రజలను పునరావస కేంద్రాలకు తరలించాలని డిమాండ్ చేశారు. తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని, జిల్లా యంత్రాంగం, మండల అధికారులు, పట్టణ ప్రజాప్రతినిధులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి ఇనుప స్తంభాలను ముట్టుకోరాదని, అత్యవసరమైతే తప్ప బయటకు రాకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు స్టాలిన్ నర్సింహులు, మండల ఉపాధ్యక్షులు మాసాపేట శ్రీనివాస్, ఓబీసీ మండల సెల్ ఆంజనేయులు, శ్రీనివాస్, అనిల్, పాల్గొన్నారు.

రేషన్ షాపులను పరిశీలించిన కేంద్ర విజిలెన్స్ కమిటీ సభ్యులు

నవతెలంగాణ-మెదక్



మెదక్ జిల్లాలోని తూప్రాన్, మెదక్ పట్టణాల్లో రేషన్ షాపులను కేంద్ర విజిలెన్స్ కమిటీ సభ్యులు డాక్టర్ ఉపేందర్, జీఎల్ శర్మ పరిశీలించారు. అనంతరం జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రేషన్ షాప్, అంగన్వాడి సెంటర్, హాస్టల్స్, స్కూళ్లలో బియ్యం నాణ్యతను ఇబ్బందులను కేంద్ర విజిలెన్స్ కమిటీ సభ్యులు విజిలెన్స్ కమిటీ సభ్యులు డాక్టర్ ఉపేందర్, జీ ఎల్ శర్మ అడిగి తెలుసుకున్నారు, అలాగే రేషన్ షాపులు సమయపాల పాటించాలని తప్పకుండా రిజిస్టర్ అమలుచేయాలని లబ్దిదారులకు నాణ్యమైన విజయం సరఫరా చేయాలన్నారు. ఫోర్ట్ ఫైడ్ ప్రాముఖ్యతను ప్రజలకు తెలిసే విధంగా అవగాహన కల్పించాలన్నారు. అనంతరం మెదక్‌లో ఎంఎల్ఎస్ గోదాంను సందర్శించి బియ్యం నాణ్యతను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిఎస్ఓ శ్రీనివాస్, డీఈవో రాధాకృష్ణ, సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ విజయలక్ష్మి, జిల్లా మెట్రోలజీ అధికారి, రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షులు ఆనంద్ కుమార్ ప్రధాన కార్యదర్శి సుధాకర్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

డాక్టర్ రవికుమార్

నవతెలంగాణ-నార్సింగి



ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ప్రజలు వాటి పట్ల జాగ్రత్తగా ఉండాలని నార్సింగి మండల ఆరోగ్య అధికారి డాక్టర్ వై రవికుమార్ సూచించారు. వర్షాల కారణంగా చెరువులలో కొత్త నీరు చేరడం వలన నీరు కలుషితమవుతాయని, కలుషిత నీరు త్రాగడం వలన జలుబు, దగ్గు, గొంతు నొప్పి, గొంతులో ఇన్ఫెక్షన్, టైఫాయిడ్, వైరల్ జ్వరాలు వచ్చే అవకాశం ఉందని అన్నారు. వీటి నివారణ కొరకు కాచి చల్లార్చిన నీటిని మాత్రమే త్రాగాలన్నారు. వర్షపు నీరు వల్ల దోమలు వృధి చెందుతాయని, దోమల వల్ల మలేరియా, చికున్ గున్యా డేంగీ జ్వరాలు ప్రబలే అవకాశాలు చాలా ఎక్కువన్నారు. దోమల కాటు నివారణ కొరకు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా దోమ తెరలను విధిగా వాడాలన్నారు. నాట్లు వేసే కాలం కావడం వలన పొలాల్లో పని చేసే వారు తడవ కుండా తగిన జాగ్రత్తలు పాటిస్తూ వాన నీటి నుంచి సాధ్యమైనంత వరకు తమను తాము కాపాడుకోవాలన్నారు. వర్షంలో తడవడం వలన జలుబు, దగ్గు లాంటి సమస్యలు వస్తాయన్నారు. మండలంలో ఎవ్వరికైనా జ్వరం వస్తె వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోగాని, లేదా సబ్ సెంటర్‌లలో గాని సంప్రదించి మందులు వాడాలని సూచించారు. మండలంలో ఎక్కడైనా జ్వరాలు ఎక్కువగా ఉంటే తన దృష్టి కి తేవాలని, తాను సర్వే చేసి సరైన మందుల ఏర్పాటు చేస్తానన్నారు. ప్రజా ప్రతినిధులు ఆరోగ్య సిబ్బందికి సహకరించి ప్రజలకు సీజనల్ వ్యాధుల పట్ల చైతన్య పరచాలని కోరారు. ముఖ్యంగా కాచి చల్లార్చిన నీటిని తాగాలని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలని మండల ఆరోగ్య అధికారి డాక్టర్ వై రవికుమార్ మండల ప్రజలను కోరారు.

ఎమ్మెల్యే సుడిగాలి పర్యటన..కాలువల పరిశీలన







నవతెలంగాణ-మెదక్

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో గత నాలుగు కురుస్తున్న వర్షాలు ముసలితోనే ముగిస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో మెతుకు సీమ తడిసి ముద్దయింది. మెదక్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి లోతట్టు ప్రాంతాల్లో సుడిగాలి పర్యటన చేశారు. మెదక్ జిల్లా కేంద్రంలోని సాయినగర్, వెంకట్రావ్ నగర్ తదితర ప్రాంతాలు ఇటీవల కురిసిన వర్షాలకు జలమయమయ్యాయి. మెదక్ పట్టణంలోని కాలువలో సిమెంటు ప్లాస్టిక్ బ్యాగులతో పాటు సీసాలు కవర్లను వేయడం వలన డ్రైనేజీ మొత్తం జామ్ అయిపోయినట్లు తెలిపారు. పట్టణంలోని డ్రైనేజీ వ్యవస్థలో నీటి ప్రవాహానికి అడ్డంకులు ఉన్న చోట ఎమ్మెల్యే పర్యవేక్షించి సమస్యను పరిష్కరించారు

నవ తెలంగాణ-హవేలీ ఘనపూర్ : మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా మండలంలో ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి సుడిగాలి పర్యటన చేశారు. గురువారం మండల పరిధిలోని సర్దన, ముత్తాయి కోట గ్రామాలలో ఎం ఎన్ కెనాల్ పరిశీలించారు. సర్దన గ్రామంలోని గత కొన్ని సంవత్సరాలుగా బీసీ హాస్టల్, ఎస్సీ కాలనీ ద్వారా ఇరిగేషన్‌కు సంబంధించిన కాలువ కూడిక తీసి ఇబ్బందులు తొలగించాలని గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా ఇరిగేషన్ శాఖ అధికారితో మాట్లాడి పనులు నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట బిఆర్ఎస్వి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడాల సతీష్, హవేలీ ఘనపూర్ మండల వైస్ ఎంపీపీ రాధా కిషన్ యాదవ్, మెదక్ ఆత్మ కమిటీ చైర్మన్ అంజా గౌడ్, మెదక్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాప సాయిలు, మెదక్ రైతుబంధు సమితి కన్వీనర్ కిష్టయ్య, హవేలీ ఘనపూర్ మండల సోషల్ మీడియా కన్వీనర్ రాజేశ్వరరావు, గ్రామ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కాపు కిషన్, గంజి నవీన్, జి బిక్షపతి ఎస్ రమేష్ గౌడ్ అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా యువత అధ్యక్షుని జన్మదిన వేడుకలు

హాజరైన ఎమ్మెల్యే మదన్ రెడ్డి, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునితారెడ్డి

యువతకు క్రికెట్ కిట్లు అందజేత



నవతెలంగాణ-కొల్చారం : బీఆర్ఎస్ కొల్చారం మండల యువత అధ్యక్షుడు కోనాపూర్ సంతోష్ రావు జన్మదిన వేడుకలు గురువారం మండలంలోని పోతంశెట్టిపల్లి చౌరస్తాలో గల ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు నర్సాపూర్ ఎమ్మెల్యే చిలుమల మదన్ రెడ్డి, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాకిటి సునీత లక్ష్మారెడ్డిలు హాజరై సంతోష్ రావును గజమాలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన జన్మదినం సందర్భంగా యువతకు క్రికెట్ కిట్లను అందజేశారు. వీరితోపాటు నియోజకవర్గ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజర య్యారు. అనంతరం ఎమ్మెల్యే మదన్ రెడ్డి, సునితారెడ్డిలు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ యువతను మరింతగా ప్రోత్స హిస్తూ వారి కోసం ఎన్నో రకాల కార్యక్రమాలు చేయడం సంతోషకరమన్నారు. సంతోష్ రావు జన్మదినం సందర్భంగా యువతకు క్రికెట్ కిట్లను అందజేయడం పట్ల సంతోష్ రావును ఎమ్మెల్యే, సునితారెడ్డిలు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మంజుల, జెడ్పీటీసీ మేఘాల, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్, జడ్పీ కోఆప్షన్ సభ్యులు మన్సూర్ అలీ, మున్సిపల్ కౌన్సిలర్ అశోక్ గౌడ్, నరేందర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయుడు శశిధర్ రెడ్డి, రవితేజ రెడ్డి, శ్రీశైలం, అంజనేయులు, యువ నాయకుడు ఆరె రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి బీఆర్ఎస్ అండ

నవతెలంగాణ-కోహెడ



కోహెడ మండలంలోని పర్వేద గ్రామశాఖ అధ్యక్షుడు ఎడబోయిన రాంచంద్రం బుధవారం బ్రెయిన్ ట్యూమర్‌తో మృతి చెందారు. మృతుని కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని హుస్నాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ అన్నారు. గురువారం ఎడబోయిన రాం చంద్రం పార్థివదేహం వద్ద ఎమ్మెల్యే నివాళులు అర్పించారు. అలాగే పార్టీకి రాంచంద్రం చేసిన సేవలు మరువలేనివని, పార్టీ మంచి నాయకున్ని కోల్పోయిందని విచారం వ్యక్తం చేశారు. అనంతరం బస్వాపూర్ గ్రామంలో ఇటీవల మృతి చెందిన తుపాకుల నారాయణ, జాన్వియా, జ్యోతిరామ్ తండాకు చెందిన బానోతు గాంధీ కుటుంబాలను ఎమ్మెల్యే పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకొని తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. అలాగే రాంచంద్రాపూర్ గ్రామంలో బొబ్బల కొండల్‌రెడ్డి తల్లి వెంకటమ్మ, కోరుట్ల రాయమల్లులు ఇటీవల మృతి చెందగా వారి కుటుంబాలను ఎమ్మెల్యే పరామర్శించారు. ఈ కార్యక్రమాలలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్ర శ్రీహరి, సీనియర్ నాయకులు కొక్కుల సురేష్, నాగరాజు మధుసూదన్‌రావు, పార్టీ మండల అధ్యక్షుడు ఆవుల మహేందర్, మాజీ ఎంపీపీ తిప్పారపు శ్రీకాంత్, మాజీ జెడ్పీటీసీ పొన్నాల లక్ష్మణ్, సర్పంచ్ ఎడబోయిన సత్తయ్య, యూత్ అధ్యక్షుడు జాలిగాం శంకర్, రహీం, ఇప్పలపల్లి కృష్ణమూర్తి, అన్నాడి రాజిరెడ్డి, సర్పంచ్ తాళ్ళపల్లి రవీందర్‌గౌడ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు వేల్పుల శంకర్, నాయకులు అన్నాడి రాజిరెడ్డి, ఇప్పలపల్లి అనంతరాములు, శ్రీనివాస్‌గౌడ్, పరుశరాములుగౌడ్, మాజీ ఎంపీటీసీ కొక్కుల రమేష్, నాయకులు బాలనర్సు, మాంకాల రమేష్, నితిన్, సన్నీ లింగం, మల్లేశం, రాకేష్, పార్టీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఏబీసీడీ వర్గీకరణనే ప్రత్యేక లక్ష్యం

ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి బొజ్జ సైదులు

నవతెలంగాణ-జగదేవపూర్



ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చట్టబద్ధత కోసం త్వరలో జరిగే వర్షాకాల పార్లమెంట్ సమావేశాలలో ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ బిల్లు పార్లమెంటులో ప్రవేశ పెట్టి చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి బొజ్జ సైదులు మాదిగ డిమాండ్ చేశారు. లేని పక్షంలో బీజేపీతో తాడో పేడో తెల్చుకుంటామని హెచ్చరించారు. మండల కేంద్రం లో ఎమ్మార్పీఎస్. అనుబంధ సంఘాల గజ్వేల్ తాలూకా ముఖ్య నాయకుల సమావేశం మండల ఇంచార్జి తుర్కపల్లి నాగరాజు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి బొజ్జ సైదులు మాదిగ మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ సాధన కోసం ఆగస్ట్ రెండవ వారంలో హైదరాబాద్‌లో నిర్వహించే మాదిగ మాదిగ ఉపకులల విశ్వ రూప మహా సభను విజయవంతం చేయాలని కోరారు. కేంద్రంలో అధికారంలోకి వస్తె 100 రోజుల్లో వర్గీకరణకు చట్టబద్ధత కల్పిస్తామని హామీ ఇచ్చిన బీజేపీ కేంద్ర ప్రభుత్వం నేటికీ అధికారంలోకి వచ్చి 9 సంవత్సరాలు అవుతున్నా బిల్లు పెట్టకపోవడం సిగ్గుచేటన్నారు. అందరూ వ్యతిరేకించిన బిల్లులను పార్లమెంట్లో బిల్లు పెట్టి అన్ని పార్టీలు సమర్థించిన ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ బిల్లును పెట్టకపోవడం బాధాకరమైన విషయమన్నారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ ఉద్యమం చివరి ఘట్టంలో ఉన్నందున గజ్వేల్ నియోజకవర్గంలోని మాదిగ ఉపకులాల విద్యార్థులు, యువకులు ఉద్యోగులు, ప్రజలు ఆగస్ట్ రెండవ వారంలో హైదరాబాద్‌లో మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో నిర్వహించే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కో కన్వీనర్ ముంద్రాతి కృష్ణ మాదిగ, మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా కో కన్వీనర్ మైస రాములు మాదిగ, ఎమ్మార్పీఎస్ గజ్వేల్, మర్కుక్ మండల ఇంచార్జిలు ఉబ్బినీ ఆంజనేయులు, చెబార్తి మహేష్, సీనియర్ నేతలు మచ్చ గణేష్, మచ్చ బాబు, తుర్కపల్లి అరుణ్, తదితులున్నారు.

రైతులకు పలు సూచనలు

నవతెలంగాణ - నిజాంపేట



గత మూడు రోజుల నుంచి మండలంలో కురుస్తున్న అధిక వర్షాల వల్ల రైతులకు మండల వ్యవసాయ అధికారి సతీష్ పలు సూచనలు చేశారు. వరి పొలాల్లో , మొక్కజొన్న , పత్తి మొక్కల సాల్ల మధ్య నీరు నిలువ ఉండకుండ బయటకు పోయేలా చర్యలు తీసుకోవాలన్నారు. అధిక వర్షాల వల్ల పత్తి మొక్కలు పసుపు రంగులోకి మారే అవకాశం ఉందన్నారు. దీన్ని అధిగమించటానికి మొక్క వయసును బట్టి10 గ్రా పొటాషియం నైట్రేట్ లీటర్ నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలని తెలిపారు .

కిషన్‌రెడ్డి అరెస్టుకు బీజేపీ నిరసన

నవతెలంగాణ-సంగారెడ్డి : బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి అరెస్ట్‌కు నిరసనగా బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ పోచారం రాములు ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ . అసెంబ్లీ ఇన్‌చార్జి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజేశ్వరరావు దేశ్పాండే మాట్లాడుతూ కేంద్ర మంత్రి బిజెపి రాష్ట్ర అధ్యక్షులు జి. కిషన్ రెడ్డిని రంగారెడ్డి జిల్లా బాటసింగారం డబల్ బెడ్ రూమ్ ఇండ్లను పరిశీలించడానికి వెళ్తుండగా అక్రమ అరెస్టు చేయడం సరైంది కాదన్నారు. కేసీఆర్ బీజేపీని చూసి భయపడుతున్నారన్నారు. ఆవాస్ యోజన పథకం కింద కేంద్ర ప్రభుత్వం పట్టణాలలో మూడు లక్షలు మంజూరు చేయడం జరిగిందన్నారు. కానీ కేసీఆర్ ప్రభుత్వం డబల్ బెడ్ రూం ఇండ్లను పూర్తి చేయలేదన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో సీనియర్ నాయకులు వెంకట్ నరసింహ రెడ్డి, డాక్టర్ రాజా గౌడ్, కౌన్సిలర్ మందుల నాగరాజు, ఓబీసీ మోర్చా స్టేట్ సెక్రటరీ పి. సురేందర్, సంగారెడ్డి మండలాధ్యక్షుడు పాపయ్య, మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు మీనా గౌడ్, అనిత మీడియా కన్వీనర్ విజయ్ కుమార్, బీజేపీ నాయకులు సివంగుల నాగరాజు , బిక్షపతి ,సూర్య నాయక్ తదితరులు పాల్గొన్నారు

మంత్రి సహకారంతో లర్నింగ్ లైసెన్స్‌లు

నవతెలంగాణ-సిద్దిపేట



వాహనాలు నడిపే యువతకు తప్పనిసరిగా లైసెన్స్‌లు ఉండాలన్న లక్ష్యంతో మంత్రి హరీశ్ రావు తమ సొంత ఖర్చులతో లర్నింగ్ లైసెన్స్‌లతోపాటు, లైసెన్స్‌లు ఇప్పిస్తున్నారని 18వ వార్డు టిఆర్ఎస్ నాయకులు శేఖర్, అంజిలు తెలిపారు. గురువారం 18వ వార్డుకు చెందిన 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులకు డ్రైవింగ్ లైసెన్స్ పంపిణీలో భాగంగా ఆర్‌టిఓ కార్యాలయానికి వెళ్లి లైసెన్స్ వెరిఫికేషన్‌లో పాల్గొన్నారు.

రాష్ట్ర గిడ్డంగుల చైర్మెన్ రజితను కలిసిన రాజేశ్వర్ రావు

నవతెలంగాణ-మర్కుక్



తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల చైర్మెన్‌గా శ్రీమతి రజని సాయిచంద్ ప్రమాణ స్వీకారం హైదరాబాద్‌లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలంలోని చేబర్తి గ్రామ శివారులో గల గోదాముల ఇంచార్జీ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సిహెచ్ రాజేశ్వర్ రావు(రాజు),హైదరాబాద్‌లో రజిత సాయిచంద్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పూల బొకే ఇచ్చి అభినందనలు తెలిపారు అనంతరం రాజేశ్వర్ రావు మాట్లాడుతూ సాయి చంద్ మరణం తీరని లోటని, సాయి చంద్ నిర్వహించిన గిడ్డంగుల చైర్మెన్ పదవిని సాయి చంద్ సతీమణికి కట్టబెట్టి సీఎం కేసీఆర్ తన ఉదారత చాటుకున్నరన్నారు.

ప్రశాంత్ నగర్ వైకుంఠ దామానికి నూతన వైకుంఠ రథం

నవతెలంగాణ-సిద్దిపేట



ప్రముఖ ఐటీసీ సంస్థ ఇటీవలి కాలంలో మంత్రి హరీష్ రావు సమక్షంలో సిద్దిపేట పట్టణ ప్రశాంత్ నగర్ వైకుంఠ దామ సుందరీకారణ పనులకు రూ.50 లక్షల నిధులను అందించారు. ఈ నిధులతో నూతనంగా కొనుగోలు చేసిన వైకుంఠ రథాన్ని మంత్రి హరీష్ రావు ఆదేశాలతో నిర్వాహకులతో కలిసి మున్సిపల్ మాజీ చైర్మెన్ కడవేరుగు రాజనర్సుకు అప్పగించారు. నిర్వాహకులు మంత్రికి, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల రాజనర్సుకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు, కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు వరాల సురేష్, విటోబా, శ్రీనివాస్, చంద్రారెడ్డి, శ్రీనివాస్, యోగి, సుందర్, పాల్గొన్నారు.

మర్కుక్ బీఎల్‌వోలతో గజ్వేల్ ఆర్డీవో సమీక్ష

నవతెలంగాణ-మర్కుక్



ప్రజాస్వామ్య దేశంలో ఓటు ప్రతి ఒక్కరి హక్కు ఓటు హక్కుని, ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసు కోవాలని గజ్వేల్ ఆర్డీవో బన్సీలాల్ తెలిపారు. గురువారం ఫోటో ఎలక్టోరల్ రోల్స్ 2వ ఎస్ ఎస్ఆర్ 2023 పై బూత్ లెవల్ ఆఫీసర్ల (బీఎల్‌ఓస్)లతో పాటు తహశీల్దారు బాగ్యరేఖతో కలసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులందరు ఓటర్ల జాబితా లో ఓటర్‌గా నమోదు చేయించుకోవాలని సూచించారు. యువత ఓటర్ జాబితాలో తమ పేరు ఉన్నది, లేనిది సరిచూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు నర్సింలు, హరీశ్ కుమార్, తదితరులున్నారు.

అధిక వర్షాలకు రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

నవతెలంగాణ-మర్కుక్




ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో రైతులు పంట పొలాలో తగుజాగ్రత్తలు తీసుకోవాలని మర్కుక్ మండల వ్యవసాయ అధికారి డా. టి నాగేందర్ రెడ్డి సూచించారు.గురువారం మండల కేంద్రమైన మర్కుక్ లో రైతుల పంట పొలాలను పరిశీలించి పలు సలహాలు, సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ వరి పొలాల్లో , మొక్కజొన్న, ప్రత్తి మొక్కల సాళ్ళ మధ్య నీరు నిలవకుండా బయటకు పోయేలా చర్యలు తీసుకోవాలన్నారు.అధిక వర్షాల వలన పత్తి మొక్కలు పసుపు రంగులోనికి మారే అవకాశం ఉందని, దీన్ని అధిగమించడానికి మొక్క వయసును బట్టి 10 గ్రాముల పొటాషియం నైట్రేట్ లేదా 19.19.19 లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. పంట ఎదుగుదలను పెంచడానికి వర్షాలు తగ్గిన వెంటనే 25 కిలోల యూరియా 10 కిలోల పొటాష్ ఎరువులను మొక్కకు ఐదు సెంటీమీటర్ల దూరంలో వేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు రజినీకాంత్, విష్ణు వర్ధన్, అశ్విని, రైతులు, తదితరులున్నారు.

దళితుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ పెద్దపీట

ఎఫ్డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి

నవ తెలంగాణ- గజ్వేల్



గజ్వేల్ నియోజకవర్గంలోని దళిత కుటుంబాల సంక్షేమానికి సీఎం కేసీఆర్ పెద్దపీట వేస్తున్నట్లు రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం సీఎం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని 19 వేల దళిత కుటుంబాలకు దశలవారీగా దళిత బంధు పథకం వర్తింపజేస్తామని స్పష్టం చేశారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ రైతుబంధు, రైతు బీమా, కేసీఆర్ కిట్టు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, బీసీ బంధు పథకాలను వర్తింపజేస్తుండడంతో ప్రజలు సంతోషంగా ఉన్నట్లు తెలిపారు. ప్రజలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ ప్రణాళికా బద్ధంగా ముందుకెళ్తుండగా జీర్ణించుకోలేని ప్రతిపక్ష పార్టీలు విమర్శలకు దిగుతున్నట్లు ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు వెంకటరెడ్డి , జెడ్పిటిసి బాలు యాదవ్, ఎంపీపీ లతా రమేష్ గౌడ్, వైస్ ప్రెసిడెంట్ కడపల బాల్రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, బీసీ సెల్ అధ్యక్షులు మురళి గౌడ్, నేతలు భూంరెడ్డి, యాదగిరి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం పరిరక్షణకు ఐక్య ఉద్యమం

నవ తెలంగాణ - సిద్దిపేట

దళితులపై దాడులు చేస్తున్న నిందితులను అరెస్టు చేయకుండా 41 సిఆర్‌పి పేరుతో స్టేషన్ బెయిలు ఇవ్వడాన్ని మానుకోవాలని కోరుతూ దళిత సంఘాల జేఏసి అధ్వర్యంలో జరిగిన జిల్లా సదస్సు డిమాండ్ చేశారు. గురువారం సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో ఎస్సీ, ఎస్టి అత్యాచార నిరోధక చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలని, 41 సిఆర్ పి పేరుతో నిందితులకు బెయిల్ ఇవ్వవద్దని డిమాండ్ చేస్తూ జిల్లా సదస్సు నిర్వహించారు. ఎస్సీ ,ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం పరిరక్షణకు ఐక్య ఉద్యమం చేపట్టాలని సదస్సు తీర్మానించింది. ఆగష్టు 5న జిల్లా కేంద్రంలో రౌండ్ టెబుల్ సమావేశం నిర్వహించాలని, 10న అన్ని మండల కేంద్రాలలో, డివిజన్ కేంద్రాలలో సమావేశాలు, అధికారులకు వినతిపత్రాలు సమర్పించి, ఉద్యమాన్ని ఉధృతం చేయాలని నిర్ణయించారు. అగస్టు 14న సిద్దిపేట అంబేద్కర్ విగ్రహం నుండి జగజీవన్ రామ్ విగ్రహం వరకు పాదయాత్ర చేయాలని, జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్ లకు వినతిపత్రాలు సమర్పించాలని సదస్సు నిర్ణయించింది. రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ కు చైర్మన్ నియమించాలని, జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటి సమావేశాలు మూడు నెలల కొకసారి నిర్వహించి దాడులను అరికట్టాలని సదస్సు డిమాండ్ చెసింది. ప్రతినెలా పౌర హక్కుల దినోత్సవం నిర్వహించాలని, జిల్లా వ్యాప్త ఉద్యమం చేపట్టాలని సదస్సు నిర్ణయించింది. డిబిఎఫ్ జాతీయకార్యదర్శి పి.శంకర్ ,యంఆర్ పిఎస్ టిఎస్ జాతీయ వర్కింగ్ అధ్యక్షుడు గుర్రాల శ్రీనివాస్, ఎస్సీ ఉపకూలాల పోరాట సమితి రాష్ట అధ్యక్షుడు బైరి వెంకటేశం, మాల మాహనాడు జిల్లా అధ్యక్షుడు జింజరపు ఎల్లేష్, వివిధ సంఘాల నాయకులు నాయకులు దప్పు శివరాజ్, రాజేందర్ సాయిలు, ముత్యాల భూపాల్, బీమ్ శేఖర్ , సిపియు ఎస్.ఐ నాయకులు బిక్షపతి, తిమ్మాపూర్, ధర్మారం, గువ్వలేగి తదితర గ్రామాలకు చెందిన బాధితుల పాల్గొన్నారు.



చెత్త సేకరించిన ప్రజాప్రతినిధులు




నవతెలంగాణ-తొగుట

గ్రామ పంచాయతీ కార్మికులు సమ్మె బాట పట్టడంతో శుభ్రత లోపించిందని పిఏసీఎస్ చైర్మన్ కన్నయ్యగారి హరికృష్ణ రెడ్డి, సర్పంచ్ గంగనిగళ్ల మల్లయ్య అన్నారు. గురువారం మండలంలోని గుడికందుల గ్రామంలో 14 రోజులుగా గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారానికి సమ్మె బాట పట్టడంతో గ్రామంలోని చెత్త ఎక్కడికక్కడే పేరుకుపోయింది. గ్రామంలో చెత్తాచెదారం పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోందని గ్రామస్తులు సర్పంచ్ గంగనిగల్ల మల్లయ్య, పిఏసీఎస్ చైర్మన్ కన్నయ్యగారి హరికృష్ణరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వారు వెంటనే స్పందించి వీధులలో ట్రాక్టర్‌పై తిరుగుతూ చెత్త సేకరించారు. గ్రామంలో చెత్తను ఎక్కడపడితే అక్కడ పారబోయొద్దని కోరారు. రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరో గ్య శాఖ మంత్రి హరీష్‌రావు సూచనల మేరకు విధులలో చేరాలని పంచాయతీ కార్మికులను కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రజని, చింత బైరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన అదనపు కలెక్టర్

నవతెలంగాణ సిద్దిపేటకలెక్టరేట్



పెద్దపల్లి జిల్లా కలెక్టర్‌గా పదోన్నతిపై వెళ్లిన జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) ముజామిల్ ఖాన్ స్థానంలో కరీంనగర్ జిల్లాలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)గా పనిచేసిన గరీమా అగర్వాల్ సిద్దిపేట జిల్లాకు బదిలీపై వచ్చారు. గురువారం సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు)గా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్‌ను మర్యాద పూర్వకంగా కలిసి మొక్క అందజేశారు. 2019 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన గరీమా అగర్వాల్ శిక్షణ కలెక్టర్‌గా యాదాద్రి భువనగిరి జిల్లాలో అనంతరం రెండు సంవత్సరాలు జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్)గా కరీంనగర్ జిల్లాలో పని చేశారు. దళిత బంధు పథకం, పోషక అభియాన్ కార్యక్రమం అమలు, నేషనల్ పంచాయతీ అవార్డు రావడానికి కృషి చేసి అందరి మన్ననలు పొందారు.

వాగులపై ప్రమాద హెచ్చరికలు



నవతెలంగాణ-నంగునూరు

గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు అక్కెనపల్లి పెద్ద వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ప్రమాద హెచ్చరికలు జారీ చేశారు. ముందు జాగ్రత్త చర్యలో భాగంగా నంగునూరు- ఘనపూర్ మధ్య బ్రిడ్జిపై, అక్కెనపల్లి- బస్వాపూర్ మధ్య బ్రిడ్జిపై, దర్గపల్లి బ్రిడ్జ్ లపై రాజగోపాల్ పేట ఎస్ఐ ఎల్. రాజు గౌడ్ ఆధ్వర్యంలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముళ్ళకంచెలను,ప్రమాద సూచికలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వాగులపై నీరు ఉధృతంగా ప్రవహిస్తున్నందున ఎవరు వెళ్ళరాదని పేర్కొన్నారు.

కుట్టుమిషన్ దరఖాస్తుల గడువును పెంచాలి

- కో ఆప్షన్ సభ్యులు హైమత్



నవతెలంగాణ-మిరుదొడ్డి

మైనార్టీ మహిళలకు కేసీఆర్ ఇస్తున్న స్వయం ఉపాధి కుట్టుమిషన్ దరఖాస్తుల గడువును పెంచాలని కో ఆప్షన్ సభ్యులు హైమత్ కోరారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిరుపేద మైనార్టీ కుటుంబాలకు ఉచితంగా కుట్టుమిషన్ అందిస్తానని ప్రకటించడం ఎంతో సంతోషకరమన్నారు. అధికారుల నిర్లక్ష్యం మూలంగా దుబ్బాక నియోజకవర్గంలో మైనార్టీలకు సమాచారం అందకపోవడం మూలంగా ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. ఉన్నతాధికారులు స్పందించి నిరుపేద కుటుంబాలకు దరఖాస్తు చేసుకునేందుకు గడువు పెంచాలని కోరారు. మైనార్టీలకు ప్రత్యేకంగా నిధులు కేటాయించి మైనార్టీ మహిళలకు కుట్టు మిషన్ అందించడం పట్ల సీఎం కేసీఆర్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

నూతన చైర్మెన్‌లకు శుభాకాంక్షలు

నవతెలంగాణ -గజ్వేల్



హైదరాబాద్‌లోని రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మెన్‌గా వేద రజని సాయిచంద్ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరై గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, మర్కుక్ మండల పార్టీ అధ్యక్షులు కరుణాకర్ రెడ్డిలు హాజరై శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మెన్‌గా మఠం బిక్షపతి ప్రమాణస్వీకారం సందర్భంగా ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గోల్కొండ బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్ గౌడ్, సంతోష్ రెడ్డి, రమేశ్ గౌడ్, నిజామొద్దీన్ పాల్గొన్నారు.

95 మందికి ఉచిత డ్రైవింగ్ లైసెన్సు అందజేత

నవతెలంగాణ-నంగునూరు



మంత్రి హరీశ్‌రావు చొరవతో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నంగునూరు మండలం వెంకటాపూర్ గ్రామనికి 95 ఉచిత డ్రైవింగ్ లైసెన్సులు అందించామని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రేకులపల్లి కోటిరెడ్డి తెలిపారు. గురువారం మంత్రి హరీశ్ క్యాంప్ కార్యాలయంలో ఉచిత డ్రైవింగ్ లైసెన్స్‌లను పంపిణీ కార్యక్రమంలో భాగంగా మండలంలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన 95 మంది మహిళలు, యువకులకు లెర్నింగ్ డ్రైవింగ్ లైసెన్సు ఇప్పించామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్ యాదవ్, సాయికిరణ్ గౌడ్, నియోజకవర్గ ఇంచార్జులు ఇర్షాత్, నిమ్మ రజినీకాంత్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

నేడు గురుకుల పాఠశాల, కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

నవతెలంగాణ-చేర్యాల

మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల (బాలుర) పాఠశాల, కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో సీఈసీతోపాటు వివిధ కేటగిరీలలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కొరకు శుక్రవారం స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బి.అశోక్ బాబు తెలిపారు. పదవ తరగతి ఉత్తీర్ణులై ఆసక్తిగల విద్యార్థులు ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో పాటు రెండు సెట్ల జిరాక్స్ కాపీలు, నాలుగు పాస్‌పోర్టు సైజ్ ఫోటోలతో ఉదయం 10:00 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు హాజరుకావాలని కోరారు. మిగతా వివరాల కోసం 9704550193 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

ఎన్నికల నిర్వహణపై బీఎల్ఓలకు అవగాహన



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

హుస్నాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలోని బూత్‌లెవల్ అధికారులకు ఎలక్ట్రానిక్ ప్రొటెక్టర్ ద్వారా గురువారం మండల పరిషత్ కార్యాలయంలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆర్డీవో బెన్ శలోమ్ బీఎల్‌వోలకు ఓటర్ నమోదు, తొలగింపు, ఓటరు మార్పుపై వివరించారు. ఎన్నికల నిర్వహణ, ఓటర్ లిస్ట్‌పై పూర్తి స్థాయి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్‌లు డిప్యూటీ తహసీల్దార్‌లు పాల్గొన్నారు.

గౌడ సంఘం నాయకునికి ఘన సత్కారం

నవతెలంగాణ-గజ్వేల్



యాదాద్రి భువనగిరి జిల్లా కాచారం కైలాసపుర రేణుక ఎల్లమ్మ దేవాలయంలో శ్రావణ మొదటి సందర్భంగా అమ్మవారిని గౌడ సంఘం నాయకులు దర్శించుకున్నారు. గురువారం వారు మాట్లాడుతూ రేణుక ఎల్లమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాల్లో పాల్గొన్న జాతీయ బీసీ సంక్షేమ సంఘం యువజన శాఖ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మోకు దెబ్బ సోషల్ మీడియా ఇంచార్జ్, ప్రముఖ సంఘ సేవకుడు సర్దార్ పంజాల వెంకట్ గౌడ్ పాల్గొన్నారు. రేణుక ఎల్లమ్మ ఆశ్రమ వ్యవస్థాపకుడు ఆలయ పూజారి డాక్టర్ వంగపల్లి అంజయ్య స్వామి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకుడు వెంకట్ గౌడ్ మాట్లాడుతూ ఇంత చక్కని ప్రశాంతమైన వాతావరణంలో డాక్టర్ వంగపల్లి అంజయ్య స్వామి ఆశ్రమం నిర్మించి భక్తులకు సకల సౌకర్యాలు కల్పించారన్నారు. ఆశ్రమంలో ఉన్న రేణుక ఎల్లమ్మ తల్లి పూజా కార్యక్రమంలో పాల్గొనడానికి అవకాశం కల్పిస్తున్న డాక్టర్ వంగపల్లి అంజయ్య స్వామికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రాష్ట్ర గౌడ సంఘం నాయకులు కార్యకర్తలు భక్తులు పాల్గొన్నారు.

ఒంటికాలిపై కార్మికుల నిరసన







నవతెలంగాణ-నంగునూరు

సమస్యలు పరిష్కరించడం లేదని గ్రామపంచాయతీ కార్మికులు వర్షంలో ఒంటి కాలుతో నిరసన వ్యక్తం చేశారు. గురువారం నంగునూరు మండల ప్రజా పరిషత్తు కార్యాలయం ముందు గ్రామ పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె 15వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా జేఏసీ జిల్లా నాయకురాలు దేవులపల్లి బాల్ నర్సవ్వ మాట్లాడుతూ గ్రామపంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించి వేతనాలు ఇవ్వాలని, పీఆర్సీలో నిర్ణయించిన మినిమం బేసిక్‌ను రూ. 19,000 వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. 51 జీవోను సవరించి మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పాత కేటగిరీ విధానాన్ని యధావిధిగా కొనసాగించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని పేర్కొన్నారు. గ్రామపంచాయతీ సిబ్బందికి అన్ని రకాల కార్మిక చట్టాలను అమలు చేయాలని గ్రామపంచాయతీ కార్మికుల మండల కార్యదర్శి చిట్యాల కనకయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు దేవులపల్లి రాజమౌళి, మండల ఉపాధ్యక్షులు ఎస్.నరసింహులు, బడె రాములు, బెల్లం బాలయ్య, రాజగోపాల్ పేట మల్లయ్య, అంశాపురం యాదయ్య, ముంద్రాయి కనకయ్య, కలవ్వ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

గ్రామపంచాయతీ కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం 15 వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ కార్మికుల సమస్యల పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. 15 రోజులు గడుస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల సమస్యలు పరిష్కరించకపోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దుర్గయ్య, శ్రీనివాస్, మామిడి సంపత్, శ్రీనివాస్, తాడూరి లక్ష్మి, సదానందం, నాగరాజు, కార్తీక్ , తిరుమల, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-చేర్యాల

తమ సమస్యలు పరిష్కారమయ్యే వరకు నిరవధిక సమ్మెను విరమించేది లేదని గ్రామ పంచాయతీ కార్మిక, ఉద్యోగ జేఏసీ మండల అధ్యక్షుడు పంతం రాజు తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం చేర్యాల మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఎదుట కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మె గురువారం 15వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా కార్మికులు బతుకమ్మ ఆడుతూ ప్రభుత్వానికి నిరసన తెలిపారు. అనంతరం రాజు మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించాలని 15 రోజుల నుంచి సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర జేఏసిని ప్రభుత్వం చర్చలకు పిలిచి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు సాయిబాబా, ఐలయ్య, బిక్షపతి, కిషన్, ప్రశాంత్, మల్లమ్మ, పరమేశ్వరి, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-తొగుట

ప్రజల ఆరోగ్యం కోసం ప్రతి రోజు గ్రామాలను పరిశుభ్రం చేస్తున్నామని మండల అధ్యక్షుడు మస్కురి శంకర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మె 15వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం మురికి కాలువలు, గ్రామంలో గల్లీలను పరిశుభ్రం చేస్తున్నామని అన్నారు. విద్యుత్ దీపాలు, మిషన్ భగీరథ నీటి సరఫరా ట్రాక్టర్ ద్వారా ప్రతి గల్లీ తిరుగుతూ చెత్త సేకరించి గ్రామాన్ని పరిశుభ్రంగా చేస్తున్నా, మా సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఈ కార్యక్రమంలో మల్లయ్య, పిట్ల రాములు, పరస్ జ్యోతి, నర్సింలు, నాగరాజు, కనకవ్వ, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-బెజ్జంకి

మండల కేంద్రంలో ఇంటింటా చెత్తను సేకరించే గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌ను స్థానికుడు నడించడాన్ని గురువారం సమ్మె సాగిస్తున్న పంచాయతీ కార్మికులు అడ్డుకున్నారు. ఎన్నో ఏండ్లుగా చాలీచాలని వేతనంతో పనిచేస్తూ గ్రామ ప్రజ లకు సేవలందిస్తున్నామని, దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన నిరవధిక సమ్మెను విచ్చిన్నం చేయకుండా ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం

- ప్రభుత్వ పాఠశాలలలో మౌళిక వసతులు శూన్యం
- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు



నవతెలంగాణ-కోహెడ

విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రెడ్డవేన అరవింద్, ప్రశాంత్‌లు ఆరోపించారు. విద్యారంగ సమగ్ర అభివృద్ధికై చేపట్టిన సైకిల్‌యాత్ర గురువారం మండల కేంద్రానికి చేరుకోవడంతో మండల నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తా వద్ద వారు మాట్లాడుతూ రాష్ట్రంలో నెల రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు వసతి గృహాలు నోట్‌బుక్‌లు, యూనిఫామ్‌లు, పెట్టెలు, పెండింగ్ బిల్లులు విడుదల చేయలేదన్నారు. విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సరైన సౌకర్యాలు లేక సరిపడా మూత్రశాలలు, మరుగుదొడ్లు లేక అనేక అవస్థలు పడుతున్నారన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం మెనూ ఛార్జీలు పెంచినట్లు ఆర్భాటాలు చేసి ఇప్పటికీ పెంచిన మెనూను అమలు చేయడం లేదన్నారు. ప్రభుత్వ పాఠశాలలలో 24 వేల టీచర్ పోస్టులు ఖాళీలు ఉన్నాయని, వాటిని భర్తీ చేయలేదని పాఠ్యపుస్తకాలు లేకుండా, టీచర్లు లేకుండా ఎలా చదువుకుంటారని ఆయన ప్రశ్నించారు. రీయంబర్స్ మెంట్స్ రూ.5,177 కోట్లు బకాయిలు ఉన్నాయని, వాటిని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సిద్దిపేట జిల్లాకు అధిక నిధులు ఇచ్చి అభివృద్ధి చేయాలని కోరారు. విద్యారంగ సమస్యలు పరిష్కారం చేయకుంటే ఛలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని హెచ్చరించారు. విద్యారంగ సమస్యలు పరిష్కారం కోసం జిల్లా వ్యాప్తంగా వర్షాన్ని సైతం లెక్కచేయకుండా సైకిల్ యాత్ర సాగుతుందని తెలిపారు. ఈ సైకిల్ యాత్రలో జిల్లా ఉపాధ్యక్షుడు కొండం సంజీవ్‌కుమార్, జిల్లా సహాయకార్యదర్శులు నాచారం శేఖర్, సంతోష్, జిల్లా నాయకులు భరత్, ప్రశాంత్, మధు, ప్రవీణ్, రాంచరణ్, తదితరులు ఉన్నారు.

పండ్ల తోటల సాగుకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-నంగునూరు



పండ్ల తోటల సాగుకు ధరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మండల హార్టికల్చర్ అధికారి ఆర్.బాలాజీ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ఉపాధిహామీ, హార్టికల్చర్ ద్వారా పండ్ల తోటల పెంపకానికి, బిందు సేద్య పరికరాలకు ప్రభుత్వ ప్రోత్సాహకం,రాయితీలు అందిస్తుందన్నారు.ప్రస్తుత వాతావరణ మార్పులు, అనారోగ్య లక్షణాలు నుండి సంరక్షణకు, రోగ నిరోధక శక్తి పెరగాలంటే డ్రాగన్ ఫ్రూట్, జామ, నిమ్మ, నేరేడు, సీతాఫలం, సపోట, పనస, నిమ్మ తదితర మార్కెట్ డిమాండ్ ఉన్న పంటలు సాగుచేయాలన్నారు.అంతర పంటలుగా పలు ఆకు కూరలు, బీర, సొర, కాకర, చిక్కుడు, టమాట, పచ్చి మిర్చి బోడ కాకర, గోరు చిక్కుడు, దోస, మునగ, పూలు లాంటి వాటినీ సాగు చేయవచ్చాన్నారు. 2023-24 సంవత్సరంనకు పండ్ల తోటల పెంపకానికి 3,300 ఎకరాలలో మామిడి, జామ, నిమ్మ, దానిమ్మ, మునగ, జీడి మామిడి, సపోటా, బత్తాయి, పనస, నేరేడు, ఆపిల్ బేరు, డ్రాగన్ ఫ్రూట్, కొబ్బరి, సీతాఫలం మొదలైన పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వ ప్రోత్సాహకం అందిచనున్నదని తెలిపారు.ఉపాధి హామీ జాబ్ కార్డ్ కలిగి వుండి, అనువైన భూమి, నీటి సౌకర్యం ఉండాలని, ఖర్చుల క్రింద ప్రతి మొక్కకు రూ.10 లు రాయితీ సదుపాయం కలదన్నారు. తోట నాటిన సంవత్సరం నుండి 4 సంవత్సరాల వరకు రాయితీలు, ప్రోత్సాహకాలు రైతు రన్నింగ్ బ్యాంక్ అకౌంట్ లో జమచేయబడునన్నారు. ఐదు ఎకరాలు లోపు వున్న షెడ్యూల్డ్ కులాలు, తెగలు, చిన్న, సన్నకారు రైతులు అర్హులు అన్నారు. రైతులకు రాయితీపై మొక్కలు, బిందు సేద్య పరికరాలు అందించబడుతాయని తెలిపారు.ఐదు ఎకరాలు లోపు అనువైన భూమి కలిగి, జాబ్ కార్డ్ ఉన్న ప్రతి షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, చిన్న, సన్న కారు రైతులు అర్హులేనని తెలిపారు. గ్రామ పంచాయితీ సెక్రటరీ, ఫీల్డ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్, ఈ.సి., ఏపీఓ, వ్యవసాయ విస్తరణ అధికారి, ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి, మండల వ్యవసాయ అధికారి, తదితర అధికారులను సంప్రదించి పండ్ల తోటల పెంపకానికి రాయితీని పొందుటకు ఈ నెల 31 లోపు దరఖాస్తు చేసుకావాలని కోరారు.

బీఆర్ఎస్ ఉచిత కరెంటు అబద్దపు మాటలు

- ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ సూర్య వర్మ



నవతెలంగాణ-సిద్ధిపేటరూరల్

బీఆర్ఎస్ ఉచిత కరెంటు అబద్దపు మాటలని ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ సూర్య వర్మ అన్నారు. గురువారం సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని రాఘవపూర్ గ్రామంలో సబ్‌స్టేషన్ 24 గంటలు ఉచిత కరెంటుపై కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి సందర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ లాగ్‌బుక్, ఎల్‌సి పరిశీలించగా సాయంత్రం ఐదు గంటల నుంచి రాత్రి పది గంటల వరకు వ్యవసాయానికి కరెంటు ఇవ్వడం లేదని అధికారికంగా తేలిందన్నారు. మంత్రి హరీష్‌రావు అబద్ధపు మాటలతో కాంగ్రెస్ పార్టీని టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డిని విమర్శించడం సరికాదన్నారు. సబ్ స్టేషన్ల వద్ద కీలకమైనవి లాగ్‌బుక్కులే అని, వాటిని మార్చే ప్రయత్నం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేస్తుందని వాస్తవానికి రెండు సంవత్సరాలుగా వ్యవసాయ రంగానికి త్రి ఫేస్ కరెంటు సరఫరాపై డిస్కం నియంత్రణ విధిస్తున్న సంగతి రైతులకు విధితమేనన్నారు. పలుచోట్ల 9 గంటల నుంచి 12 గంటల వ్యవసాయానికి త్రీ ఫేస్ కరెంటు ఇస్తున్నారని పేర్కొన్నారు. కొన్నిచోట్ల ఉన్నతాధికారులు సబ్‌స్టేషన్‌లోని లాగ్‌బుక్‌లను ఏఈలు స్వాధీనం చేసుకుంటున్నారని, మరికొన్ని చోట్ల లాగ్‌బుక్కులను ఎవరికీ చూపించవద్దని సబ్ స్టేషన్‌లోని ఆపరేటర్లకు ఉన్నతాధికారులు మౌఖిక ఆదేశాలు జారీ చేశారన్నారు. దీనిలో పారదర్శకత ఎక్కడ ఉందని ప్రశ్నించారు. వాస్తవాలు బయటపడతాయని తెలిసి లాగ్ బుక్కులను ఎవరికి చూపించవద్దని ప్రభుత్వాలు ఆదేశాలు జారీ చేయడం 24 గంటల కరెంటు ఇవ్వడం లేదని ప్రభుత్వమే ప్రకటించి నట్లు అయ్యింది అన్నారు. ఐదు రోజుల క్రితం రోజు 12 గంటల పాటు త్రీ ఫేస్ కరెంటు ఇచ్చిన సంఘటనలను రాష్ట్రవ్యాప్తంగా ఉన్నాయని ప్రస్తుతం 20 గంటలకు కరెంటు సరఫరా చేస్తున్నారని ఇది కాంగ్రెస్ సాధించిన విజయమని కాంగ్రెస్ దెబ్బతో, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దిగివచ్చినట్లు అయ్యిందని అన్నారు. ఈ కార్యక్రమంలో జంగిటి శ్రీనివాస్, మండల అధ్యక్షుడు గరిపల్లి రాములు, గరిపల్లి వెంకట్, చిన్నకోడూర్ ఓబీసీ సెల్ అధ్యక్షుడు చిరంజీవి, మండల్ ఎస్సి సెల్ అధ్యక్షుడు రమేష్, హర్షద్, శివకుమార్, రఘు, నవీన్, కుమార్,రాజు, జావిద్, పాల్గొన్నారు.

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అరెస్ట్ అప్రజాస్వామ్యకం

నవతెలంగాణ - సిద్దిపేట



తెలంగాణలో సీఎం కేసీఆర్ నయా నిజాంలా వ్యవహరిస్తూ, తన నియంత్రత్వ పోకడలను చూపిస్తున్నారని, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అరెస్ట్ అప్రజాస్వామ్యకమని బిజెపి సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు దూది శ్రీకాంత్ రెడ్డి అన్నారు. గురువారం సిద్దిపేటలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాటసింగారంలో డబుల్ బెడ్ రూం ఇళ్లు చూడడానికి వెళుతున్న కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తో పాటు బిజెపి నాయకులను అరెస్టు చేయడం అప్రజాస్వామికం అని మండిపడ్డారు. దేశంలోని ప్రతి కుటుంబం యొక్క కలలను నెరవేర్చే దిశగా నరేంద్ర మోడీ ప్రభుత్వం దేశవ్యాప్తంగా దాదాపు 3 కోట్ల ఇళ్లను మంజూరు చేసిందని, అందులో భాగంగా తెలంగాణ రాష్ట్రానికి 2.5 లక్షల ఇళ్లను మంజూరు చేసిందని తెలిపారు. కేంద్రం మంజూరు చేసిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం ఎంత మేరకు కొనసాగుతుందో చూడడానికి వెళుతున్న కేంద్రమంత్రిని అడ్డుకోవడం సిగ్గుచేటు అన్నారు. పేదల గోడు పట్టని కేసీఆర్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణం పై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. సొంత ఇంటి కోసం ఎదురుచూస్తున్న లక్షలాదిమంది పేదలకు అండగా బిజెపి తెలంగాణలో నేడు చేపట్టిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పరిశీలన కార్యక్రమాన్ని అడ్డుకోవడం ద్వారా కేసిఆర్ ప్రభుత్వం పేద ప్రజల వ్యతిరేక ప్రభుత్వం అన్న విషయం బట్టబయలైందని ధ్వజమెత్తారు. ప్రజాస్వామ్యంలో నిరసన చేసే హక్కు ప్రతిపక్షాలకు ఉందని అన్నారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చే బాధ్యత భారతీయ జనతా పార్టీ పోషిస్తుంటే ఇంత అక్కసు వెళ్లగక్కడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. బిఆర్ఎస్ ప్రభుత్వం తీరు మార్చుకోకపోతే ప్రజలే మిమ్మల్ని మార్చడం ఖాయమని, రాబోయే ఎన్నికల్లో ప్రజలే తగిన బుద్ధి చెప్తారని అన్నారు. అరెస్టు చేసిన బిజెపి నాయకులను కార్యకర్తలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పట్టణ అధ్యక్షుడు పత్రి శ్రీనివాస్ యాదవ్ ,మీడియా సెల్ జిల్లా కన్వీనర్ గోనె మార్కండేయులు , పుల్లూరు రాజు, కెమ్మసారం సంతోష్, కమ్మ శ్రీనివాస్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌కు గజ్వేల్‌లో ఎదురులేదు

- బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేతలు



నవతెలంగాణ-గజ్వేల్

ముఖ్యమంత్రి కేసీఆర్‌కు గజ్వేల్‌లో ఎదురులేదని రైతుబంధు సమితి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దేవి రవీందర్, డీసీఎంఎస్ ఉమ్మడి జిల్లా డైరెక్టర్ జేజేల వెంకటేశం గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు బెండ మధు లుఅన్నారు. గురువారం గజ్వేల్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కొన్ని పార్టీల నాయకులు గజ్వేల్ నుంచి పోటీ చేస్తామని గొప్పలు చెప్పుకుంటున్నారన్నారు. పోటీ చేస్తామంటే కేసీఆర్ మరో నియోజకవర్గం చూసుకుంటున్నారని తప్పుడు ప్రచారం చేసుకుని కాలం గడుపుతున్నారన్నారు. 9 సంవత్సరాల కాలంలో ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. కళ్ళు ఉండి చూడలేని గుడ్డివాళ్ల కాంగ్రెస్, బీజేపీ నాయకులు చిల్లర మాటలు మాట్లాడుతూ గజ్వేల్ నియోజకవర్గ ఇజ్జత్ తీస్తున్నట్లు వారు చెప్పారు. గతంలో టీడీపీ కాంగ్రెస్ గజ్వేల్‌లో ఎమ్మెల్యేగా ఉండి గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మధ్యన ఒక చిన్న బ్రిడ్జి కట్టలేకపోయారని వారు గుర్తు చేశారు. విమర్శలు మానుకొని అభివృద్ధి కోసం కలిసి రావాలని వారు సూచించారు.

అందరం ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం బాగుంటుంది

- మున్సిపల్ చైర్మెన్ ఆకుల రజిత వెంకన్న



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

అందరూ ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం బాగుంటుందని మున్సిపల్ చైర్మెన్ ఆకుల రజిత వెంకన్న అన్నారు. గురువారం హుస్నాబాద్ పట్టణంలో బాలవికాస స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో క్యాన్సర్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మున్సిపల్ చైర్మెన్ మాట్లాడుతూ బాలవికాస స్వచ్ఛంద సంస్థ క్యాన్సర్‌పై అవగాహన కల్పించడం చాలా మంచి ఆలోచన అన్నారు. ప్రతి ఒక్కరు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ప్రత్యేకించి మహిళలు ప్రతి ఆరు నెలలకు ఒకసారి స్క్రీన్ టెస్ట్, హెల్త్ చెకప్ చేయించుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఐలేని అనిత శ్రీనివాస్ రెడ్డి, సూపరింటెండెంట్ డాక్టర్ రమేష్ రెడ్డి, మాతా శిశు సంక్షేమ శాఖ అధికారి రమాదేవి, కేడం లింగమూర్తి, ఐలేని మల్లికార్జున్ రెడ్డి, డాక్టర్ ధర్మ, జ్యోతి, మహిళలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వర్షాకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- రామకోటి రామరాజు విజ్ఞప్తి



నవతెలంగాణ-గజ్వేల్

గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గజ్వేల్ పట్టణానికి చెందిన శ్రీరామకోటి భక్త సమాజం వ్యవస్థాపక, అధ్యక్షుడు రామకోటి రామరాజు విజ్ఞప్తి చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ వచ్చే మూడు రోజులు కూడా భారీ వర్షాలు ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని. వేడి చేసిన నీటినే త్రాగాలని, నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు తినరాదన్నారు. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కరెంట్ స్తంబాలను, విద్యుత్ వైర్లను, ట్రాన్స్ఫార్లను తాకరాదన్నారు. ఉధృతంగా ప్రవహించే చెరువులు, వాగుల వద్దకు వెళ్ళ వద్దన్నారు. పాత ఇండ్లు కూలిపోయే స్థితిలో ఉంటే జాగ్రత్తగా ఉండాలి, వ్యవసాయ, ఇతర పరిసరాల్లో విష సర్పాలతో జాగ్రత్తగా ఉండాలన్నారు. మ్యాన్ హెూల్స్, డ్రైనేజీలను చూసుకుంటూ నడవాలి, అత్యవరం ఉంటే తప్ప బయటకు రావొద్దని ఆయన కోరారు.

నిండుతున్న చెరువులు, కుంటలు

- మద్దూరు ఎంపీపీ బద్దిపడగ కృష్ణారెడ్డి

నవతెలంగాణ-మద్దూరు



గత నాలుగు నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ బద్దిపడగ కృష్ణారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చెరువులు. కుంటలు. నిండి ఉంటాయని వాగులు ప్రవహిస్తూ ఉంటాయని అక్కడికి ఎవరు ప్రజలు చేపలు పట్టేందుకు వెళ్లవద్దని ఆయన సూచించారు. శిథిలావస్థలో ఉన్న ఇండ్లలో ప్రజలు ఉండవద్దని మట్టి గోడలు ఉన్న ఇండ్లను ప్రజలు వెంటనే ఖాళీ చేసి బంధువుల దగ్గరకు వెళ్లాలని ఆయన కోరారు. వాహనదారులు వెళ్లే క్రమంలో వాగులు ప్రవహిస్తున్నప్పుడు స్లిప్ అయ్యే అవకాశం ఉంటుందని ప్రతి ఒక్క వాహనదారుడు హెల్మెట్ తప్పకుండా ధరించాలని ఆయన కోరారు. ఉరుములు మెరుపులు వచ్చే క్రమంలో చెట్ల వద్ద రైతులు ఉండకూడదని ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల్లో ప్రజలు జాగ్రత్త వహించాలన్నారు. రైతులు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్స్‌ను విద్యుత్ వైర్లను తాకవద్దని ఆయన కోరారు. చిన్నపిల్లలు బయటకు వెళ్లకుండా తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలని ఆయన కోరారు. ఏమైనా ఇబ్బందులు తలెత్తితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ మలిపెద్ది సుమ మల్లేశం, ధూల్మిట్ట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మంద యాదగిరి, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి బర్మా రాజ మల్లయ్య, ఎంపీటీసీ నందన బోయిన నర్సింలు, బైరాన్ పల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు దాసరి పురుషోత్తం, పాల్గొన్నారు.

పాతపెన్షన్ అమలు చేయాలి



నవతెలంగాణ - సిద్దిపేట

రాష్ట్రంలోని సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాతపెన్షన్ అమలు చేయాలని సీపీఎస్ జిల్లా అధ్యక్షులు చేగురి దేవరాజ్, ప్రధానకార్యదర్శి బత్తిరాజు శశికుమార్ డిమాండ్ చేశారు. 27న సంకల్ప రథయాత్రను సిద్దిపేటలో నిర్వహించడం జరుగుతుందని, దీనికి సంబంధించిన గోడపత్రికను వివిధ కార్యాలయాల వద్ద గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రథయాత్ర కార్యక్రమానికి జిల్లాలోని అన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు మద్దతు ప్రకటించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. 27న జరిగే సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా బాధ్యులు కరుణ శ్రీ, సతీష్ త్యాగరాజ్, ఉద్యోగ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ భవనాలు లేక ఇబ్బందులు

- కూలిపోతున్న తాత్కాలిక జీపీ గది





నవతెలంగాణ-వర్గల్

మండలంలోని జబ్బాపూర్ గ్రామంలోని తాత్కాలిక గ్రామపంచాయతీగా ఏర్పాటు చేసిన గది వర్షం కారణంగా కూలిపోతున్నది. గ్రామపంచాయతీ భవనం లేక ఇబ్బందులు పడుతున్నారు. జబ్బాపూర్ గ్రామపంచాయతీ నూతనంగా ఏర్పడింది. ఈ గ్రామంలో గ్రామపంచాయతీ భవనం లేకపోవడంతో తాత్కాలిక గదిని ఏర్పాటు చేసి జీపీ పనులకు వాడుకుంటున్నారు. గతంలో నూతన గ్రామపంచాయతీలకు భవనం మంజూరు చేయడంతో జబ్బాపూర్ గ్రామంలో రూ.20 లక్షల నిధులతో నిర్మాణం చేపట్టారు. భవనం అసంపూర్తిగా మిగిలిపోవడంతో తాత్కాలికంగా జీపీ గది ఏర్పాటు చేశారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఆ గది కూలిపోవడంతో సమగ్రితో రోడ్డుపైకి రావాల్సి వచ్చింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీలో ఎస్సీలకు ఎక్కువ కేటాయించాలి



నవతెలంగాణ-మద్దూరు

డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీలో మొదటి విడత నలుగురికే పంపిణీ చేశారని, రెండో విడతలో ఎస్సీలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఎక్కువ కేటాయించాలని దూల్మిట్ట మండలంలోని జాలపల్లి గ్రామానికి చెందిన దళితులు సర్పంచ్ చొప్పరి వరలక్ష్మి సాగర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో మొదటి విడత డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీలో దళితులకు 16 లో నాలుగు కేటాయించినందుకు సర్పంచ్ కు కృతజ్ఞతలు తెలిపినట్టు వారు తెలిపారు.అలాగే రెండో విడతలో దళితులకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు పంపిణీ చేయాలని వారు కోరారు. అదేవిధంగా ఇల్లు లేని నిరుపేదలకు ఖాళీ స్థలాలు ప్లాట్లు చేసి పంపిణీ చేయాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో సాయిలు,బాలయ్య,ప్రేమయ్య,సంపత్, శ్రీనివాస్,యాదయ్య,బాబు,స్వామి,వంశీ,ప్రశాంత్,రాజు, రమేష్ పాల్గొన్నారు

కిషన్‌రెడ్డి అరెస్టు అప్రజాస్వామికం



నవతెలంగాణ - చిన్నకోడూరు

హైదరాబాద్ శివారు బాటసింగారంలో ఎనిమిదేళ్లుగా అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సముదాయాలను పరిశీలించేందుకు వెళ్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, దుబ్బాక శాసన సభ్యులు రఘునందన్‌రావులు అరెస్టు చేయడం అప్రజాస్వామికం అని బీజేవైఎం చిన్నకోడూరు మండల నాయకులు సాయికిరణ్ అన్నారు. రాష్ట్రంలో నెలకొన్న ప్రజాసమస్యలను గుర్తించడానికి ఏర్పాటు చేసిన చలో బాటసింగారం కార్యక్రమాన్ని అడ్డుకునేందుకే బీజేపీ నాయకులను అరెస్టు చేశారని ఆరోపించారు. పోలీసుల వైఖరి సరైనది కాదని తెలంగాణలో ప్రజలు పోరాటానికి ఎన్నడు భయపడలేదని వచ్చే ఎన్నికలలో టిఆర్ఎస్ కి ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గరనే ఉందని అన్నారు. మండల అనిల్, నాగరాజు, మనోజ్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

అభివృద్ధి, సంక్షేమం కేసీఆర్ లక్ష్యం

- ఎఫ్డిసి చైర్మన్ ఒంటేరు ప్రతాప్‌రెడ్డి

నవతెలంగాణ - గజ్వేల్: అభివృద్ధి, ప్రజలకు సంక్షేమ పథకాలు అందించాలనే లక్ష్యం ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఉందని ఎఫ్డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. గురువారం గజ్వేల్‌లో సీఎం మినీ క్యాంప్ కార్యాలయంలో వర్గల్ మండలం గిర్మాపూర్ చెందిన కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు చెందిన భారీ ఎత్తున నాయకులు కార్యకర్తలు ఎఫ్ డి సి చైర్మన్ ఒంటేరు ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలో ఉండగా ఎన్ని కుంభకోణాలు, అవినీతులు జరిగాయో పిసిసి అధ్యక్షుడు రేవంత్ రెడ్డికి తెలియదా అని ప్రశ్నించారు. అవినీతికి పాల్పడ్డ మంత్రులు, ఐపీఎస్ ఐఏఎస్ అధికారులు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జైలు పాలయ్యారని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రం సాధించి మచ్చలేని నాయకుడిగా రాష్ట్ర ముఖ్యమంత్రిగా తొమ్మిది సంవత్సరాలు పరిపాలన అందిస్తున్నది కేసీఆర్ ఒక్కరే అన్నారు. కాంగ్రెస్ పార్టీకి అధికారం ఇస్తే ఆరు నెలలకు ఒక ముఖ్యమంత్రి మారతారని విమర్శించారు.

అధిక వర్షాలతో జాగ్రత్తలు పాటించాలి

నవతెలంగాణ-అక్కన్నపేట

ఈ ఏడాది వర్షాకాలం లేటుగా ప్రారంభమైంది. వారం రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా వానలు కురుస్తున్నాయి. ఈ వర్షాల దాటికి ఉష్ణోగ్రతలు తేమ శాతం అతిగా పెరిగిపోవడం వల్ల ప్రకృతిలో జరిగే మార్పులను అధిగమించి పంటలు వేసుకోవడానికి రైతులు ఎలాంటి పద్ధతులు పాటించాలో జనగామ ఏఈఓ శ్రీలత వివరించారు.

పత్తి పంట సాగులో..

ఎక్కడైతే నీరు నిల్వ ఉంటుందో అక్కడినుంచి తక్షణమే నీరు తీసివేసి, చిన్న కాలువలు ఏర్పాటు చేసుకోవాలి. అధిక వర్షాలకు కలుపు సమస్య ఎక్కువవుతుంది దీని నివారణకు క్విజలోఫాప్ ఈథైల్ 400 మి. లీ లేదా ప్రోపాక్విజాపాప్ 250 మి. లీ ఎకరానికి పిచికారి చేయాలి. అధిక వర్షాల వల్ల మొక్కలు ఎండిపోయే అవకాశం ఉంది దీని నివారణకు కాపర్ ఆక్సీ క్లోరైడ్ 3 గ్రా.లేదా కార్బండిజమ్ 1 గ్రా. లీటర్ నీటిలో కలిపి వారం రోజుల వ్యవధిలో 2, 3సార్లు మొక్కల అడుగు భాగం తడిచేల పిచికారి చేయాలి. వర్షాలు తగ్గిన తర్వాత ఎకరానికి 25 కిలోల యూరియాను,10 కిలోల ఎం ఓ పి వేసుకోవాలి.

మక్క పంట సాగులో..

ఎక్కువ వర్షపాతం నమోదైనప్పుడు మొక్కజొన్న లేత దశలో అధిక తేమను తట్టుకోలేదు దీని నివారణకు మక్కల సాళ్ళ మధ్యలో నీరు నిలవకుండా



కాలువల ద్వారా బయటకు పోయేలా చూసుకోవాలి. అధిక తేమ వలన భాస్వరం లోపం ఏర్పడి మొక్కలు రంగు మారే అవకాశం ఉంటుంది. వర్షాలు ఆగిన తర్వాత డి ఏ పి 20 గ్రా. లీటర్ నీటికి లేదా 19.19.19 5 గ్రా. లీటర్ నీటికి కలిపి వారం రోజుల వ్యవధిలో 2సార్లు పిచికారి చేయాలి. కత్తెర పురుగు గమనిస్తే క్లోరాంట్రానిలిప్రోల్ 0.4 మి. లీ లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.4 మి.లీ లీటర్ నీటికి కలిపి ఆకుల సుడులు తడిచేల పిచికారి చేయాలి.

కంది పంటలో..

అధిక తేమ వల్ల మొక్కలలో ఇనుము లోపం వచ్చి ఆకులు పసుపు రంగులోకి మారి ఎండి రాలిపోతాయి దీని నివారణకు లీటరు నీటికి 5 గ్రా. ఫెర్రస్ సల్ఫేట్ (అన్నభేది) ఒక గ్రామ్ నిమ్మ ఉప్పుతో కలిపి పైరుపై వారంలో 2 సార్లు పిచికారి చేయాలి.వర్షాలు ఆగిన తర్వాత పంట త్వరగా కోలుకోవడానికి 20 గ్రా. యూరియా లీటర్ నీటికి కలిపి వారం రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారి చేయాలి.

వరి సాగులో..

అధిక వర్షాలు ఉన్నప్పుడు ప్రధాన పొలంలో నీరు నిల్వ ఉండడం వల్ల మొక్కల వేర్లు నల్లబడి చనిపోతాయి. దీని నివారణకు పొలాన్ని ఆరగట్టాలి. తర్వాత నీరు పెట్టి ఎకరాకు 20-30 కిలోల యూరియాకు 50-60 గ్రా. కార్బ%o%"¦È%o% 25 శాతంంమా%o%కోజెబ్ 50 శాతం మిశ్రమాన్ని కలిపి పొలమంత సమానంగా పడేటట్లు చల్లాలి. పొలాన్ని చేతితో కలియబెట్టాలి. అధిక తేమ, ఉష్ణోగ్రత ఉన్నప్పుడు నారు మడిని వరి గడ్డితో కప్పి ఉంచాలి. నారు మడిలో కలుపు సమస్య ఉంటే సైహలోఫాప్ పీ బ్యూ టైల్ 1.5 మి. లీ లేదా బిస్పైరిబాక్ సోడియం 0.5 మి.లీ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.అధిక వర్షాల వల్ల నారు చనిపోతే రైతులు ఆగస్టు మాసం వరకు వెదజల్లే పద్ధతి లేదా డ్రం సీడర్ తో వేసుకోవడం మంచిది.నారు పోయడం నాటేయడం ఆలస్యం అయినాకొద్ది దిగుబడులు తగ్గడమే కాకుండా చీడ పీడల ఉధృతి అధికంగా ఉంటుందని రైతులు గమనించాలి.

నీటిని లోతట్టు ప్రాంతాలకు పంపాలి



నేలకు సేంద్రియ పదార్థాన్ని అందించడం ద్వారా నేల నిర్మాణాన్ని బాగుపరిచి నీరు బాగా ఇంకేలా చుస్కోవాలి. పంట పొలాల్లో నిలిచిన నీరును లోతట్టు ప్రాంతాల వైపు కాలువలు చేసి తీసివేయాలి.

- ఏఈఓ శ్రీలత జనగాం క్లస్టర్

పంటలను పరిశీలించిన వ్యవసాయ శాస్త్రవేత్తలు





నవతెలంగాణ-దుబ్బాక రూరల్

దుబ్బాక మండలం పరిధిలోని తిమ్మాపూర్, చీకోడు, ఆరెపల్లె, ఆకారం గ్రామాలలో రైతులు సాగు చేస్తున్న వర్షాధారిత, ఆరుతడి పంటలు వ్యవసాయ క్షేత్రాలను తొర్నాల(వ్యవసాయ పరిశోధన స్థానం) ప్రధాన శాస్త్రవేత్త అధిపతి డా.ఎస్.శ్రీదేవి, జె.విజయ్, కో ఆర్డినేటర్, ఏరువాక కేంద్రం, తొర్నాల శాస్త్రవేత్త (బ్రీడింగ్) ఎ. సరిత ప్రజా ప్రతినిధులు, రైతులు, రైతు సమన్వయ కమిటీ కో ఆర్డినేటర్లతో కలిసి గురువారం పరిశీలించారు. గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వరి, మొక్కజొన్న, పెసర, కంది, కూరగాయ పంటలలో తీసుకోవాల్సిన చర్యల గురించి తెలియజేశారు. అనంతరం పురుగు ఆశించిన పంట పొలాలలో చేయవలసిన మందుల పిచికారీ గురించి వివరించారు. అధిక వర్షాల కారణగా ఎక్కడైతే నీరు నిల్వ ఉంటుందో అక్కడ చేనులో నుండి నీటిని తీసివేయాలని సూచించారు. పత్తి పొలాలకు పచ్చదోమ ఆశించినదని గమనించి, దీని నివారణకు వర్షాలు తగ్గిన తరువాత మోనోక్రోటోఫాస్ 1.6 మి. లీ. పిచికారి చేయాలని సూచించారు. అధిక వర్షాల కారణంగా మొక్కలు ఎండిపోవడం గమనించినట్లైతే కాపర్ ఆక్సీ క్లోరైడ్ 3 గ్రా. లీటరు నీటిలో కలిపి మొక్కల అడుగు భాగం తడిసేల పోయాలని తెలిపారు. పై పంటలకు పోషకాలు అందించటానికి 19:19:19 లేదా యూరియా 10 గ్రా. ని లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని పేర్కొన్నారు. ప్రస్తుతం జిల్లాలో వరి నారు మడి దశలో మరియు కొన్ని ప్రాంతాల్లో నాట్లు వేసి 10 రోజులు అవుతుంది. ప్రధానంగా పొలంలో నీరు నిలిచినట్లైతే నీరు నిలవకుండా బయటకు వెళ్ళే కాలువలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. అలాగే మొక్కజొన్న లో కత్తెర పురుగు ఉధృతి వలన ఆకుల పై రంధ్రాలను గమనించి, ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రా. లీటర్ నీటికి కలిపి వర్షాలు తగ్గిన తరువాత మొక్క సుడిలో పిచికారి చేయాలని చెప్పారు. పెసరలో పల్లాకు తెగులు నివారణకు వర్షాలు తగ్గిన తరువాత మోనోక్రోటోఫాస్ 1.6 మి. లీ. లేదా ఎసిఫేట్ 1.5 గ్రా. పిచికారి చేస్తే పంటలను కాపాడుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో దుబ్బాక మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్, వ్యవసాయ విస్తరణ అధికారులుచైతన్య,అస్మా,హరీష్, చీకోడు గ్రామ సర్పంచ్ తౌడ శ్రీనివాస్, రైతు సమన్వయ సమితి కోఆర్డినేటర్ లు సైదుగారి ఎల్లం, ముత్తరెడ్డి పాల్గొన్నారు.

గతంలో మసాలా తిప్పలు రైతులు మరవలేదు



నవతెలంగాణ జగదేవపూర్

గతంలో మసాలా తిప్పలు రైతులు మరవలేదని టిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు పనుగట్ల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులను చూసి కాంగ్రెస్ నాయకులు ఓర్వలేక బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. విద్యుత్‌పై లేనిపోని ఆరోపణలు చేస్తూ తమ ఉనికిని చాటుకునే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. కాళేశ్వరం, కొండపోచమ్మ రిజార్వాయర్ ద్వారా ఒక ఎకరం కూడా సాగుకు నీరు అందలేదన్నడం విడ్డూరమని ఎద్దేవా చేశారు. జగదేవపూర్ మండల కేంద్రంలో నా సొంత స్థలంలో మొక్కజొన్న పంట వేసి ఆరెకరాలు మొక్కజొన్న పండించాలని, అది పూర్తిగా వేసవి కాలంలో కొండపోచమ్మ రిజార్వాయర్ నీళ్లతో మాత్రమే పండించాలని అన్నారు. నేను ఈ పంట పండించిన స్థలంలో నాకు ఎలాంటి బోరుబావి లేదని కూడా లేదని సవాలు విసురుతున్నాను. ప్రతి రైతు కేసీఆర్ ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దేశంలో ఎక్కడ లేని పథకాలు ప్రవేశపెడుతూ ప్రజల గుండెల్లో నిలుస్తున్నారని అన్నారు. కాబోయే ముఖ్యమంత్రి కేసీఆర్ అన్న సంగతి కాంగ్రెస్ నాయకులకు తెలియడం లేదన్నారు. గతంలో విద్యుత్ కోసం, మసాలా కోసం వర్షంలో నిలబడ్డ సంగతి రైతులు ఇంకా మరిచిపోలేదని అన్నారు. ఇవాళ ప్రతి రైతు గుండె నిబ్బరంగా ఉన్నారని గుర్తు చేశారు.

జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు మెరీడియన్ విద్యార్థిని ఎంపిక



నవతెలంగాణ-సిద్దిపేట

తైక్వాండో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జులై 28 నుంచి 30 వరకు ఉత్తరప్రదేశ్ లోని లక్నోలో జరిగే ఆరో నేషనల్ కాడెట్ క్యోర్గి తైక్వాండో ఛాంపియన్ షిప్-2023 పోటీలకు మెరీడియన్ పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతున్న ఎం.బిందు అండర్ 14 విభాగంలో ఎంపిక అయ్యిందని ప్రిన్సిపాల్స్ రాజేందర్ రెడ్డి, సౌజన్య తెలిపారు. విద్యార్థులను అన్ని రంగాలలో ప్రోత్సహించడమే లక్ష్యంగా పాఠశాల నిర్వహించడం జరుగుతుందని, విద్యార్థులకు విశాలమైన ఆట స్థలాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. జాతీయస్థాయిలో ఎంపికైన విద్యార్థినిని పాఠశాల డైరెక్టర్లు దేవేందర్ రెడ్డి, రాజా వెంకటరెడ్డి, ప్రిన్సిపాల్స్ రాజేందర్ రెడ్డి, సౌజన్యలు అభినందించారు. మెమొంటోలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు



- సీఐ సత్యనారాయణ రెడ్డి

నవతెలంగాణ-చేర్యాల: ర్యాగింగ్‌కు పాల్పడితే ఆరు నెలల నుండి మూడు సంవత్సరాల వరకు జైలు శిక్ష పడుతుందని చేర్యాల సీఐ సత్యనారాయణ రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో గురువారం విద్యార్థులకు ర్యాగింగ్ చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు గుట్కాలు, మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా బంగారు భవిష్యత్తు కోసం చదువులో రాణించాలని, ఎలాంటి చెడు వ్యసనాలకు అలవాటు పడకుండా క్రమశిక్షణ గల పౌరులుగా తయారవ్వాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్సై భాస్కర్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ బి. అశోక్ బాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చట్టసభల్లో గౌడ కులస్తులకు అవకాశం కల్పించాలి

గౌడ జన హక్కుల పోరాట సమితి మోకు దెబ్బ జాతీయ అధ్యక్షులు అమరవేణి నర్సాగౌడ్

నవ తెలంగాణ రాయపోల్

చట్ట సభల్లో గౌడకులస్తులకు జనాభా దామాషా ప్రకారం అవకాశం కల్పించాలని, గీతా కార్పొరేషన్ ఏర్పాటు చేసి గౌడ కులస్తుల సమస్యలను పరిష్కరించాలని గౌడ జన హక్కుల పోరాట సమితి మోకు దెబ్బ జాతీయ అధ్యక్షులు అమరవేణి నర్సాగౌడ్ అన్నారు. గురువారం రాయపోల్ మండల కేంద్రంలో జీఎల్ఆర్ గార్డెన్స్‌లో గౌడ జన హక్కుల పోరాట సమితి మోకు దెబ్బ జిల్లా అధ్యక్షులు అహ్మదీపూర్ రాజుగౌడ్ అధ్యక్షతన జిల్లా 2వ మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో 12 శాతం బీసీ జనాభాలో 18 శాతం ఉన్న గౌడ కులస్తులకు చట్టసభల్లో అవకాశం కల్పించడంలో అన్ని రాజకీయ పార్టీలు విఫలమయ్యారని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలలో గౌడ కులస్తులకు కుల దామాషా ప్రకారం ఎమ్మెల్యే ఎంపీ సీట్లు కేటాయించాలన్నారు. చట్ట సభల్లో వాటా సాధన కోసం గౌడ జన హక్కుల పోరాట సమితి మోగుదెబ్బ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలలో మహాసభలను నిర్వహిస్తూ ఆగస్టు 10న నిర్మల్ జిల్లా కేంద్రంలో రాష్ట్ర మహాసభలు నిర్వహించి ఆగస్టు ఆఖరి వారంలో చలో హైదరాబాద్ పేరిట రెండు లక్షల మంది గౌడ కులస్తులను తరలించి గౌడ కులస్తుల సమస్యల పరిష్కారంతో పాటు కల్లుగీత వృత్తి రక్షణ రాజ్యాధికార వాటా కోసం హైదరాబాదులో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్ని కులాలకు నిధులు కేటాయించి గౌడ కులానికి నిధులు కేటాయించకపోవడాన్ని గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ తీవ్రంగా ఖండిస్తూ తక్షణమే గీతా కార్పొరేషన్‌కు రూ.5 వేల కోట్లు కేటాయించి కల్లు గీత వృత్తిని ఆధునీకరించి గీత కార్మికులకు సేఫ్టీ మోకులను అందించాలన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పేరును జనగామ జిల్లాకు నామకరణ చేసి ట్యాంక్ బండ్ పైన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. కల్లుగీత వృత్తిని మత్తు పానీయాల జాబితాను తొలగించి సహకార సంఘంలో కలపాలన్నారు .జీవో 560 ప్రకారం ప్రతి గ్రామానికి 5 ఎకరాల భూమి ఇచ్చి, తాటి, ఈత వనాన్ని హైబ్రిడ్ విత్తనాలను పంపిణీ చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్లో ఉన్న లైసెన్స్ వెంటనే ఇప్పించాలన్నారు. కార్యక్రమంలో గౌడ జన హక్కుల సమితి మోకుదెబ్బ సెకరిటరీ జనరల్ రాగుల సిద్ధి రాములు గౌడ్, జాతీయ ప్రధాన కార్యదర్శి కోనాపురం బాలరాజ్ గౌడ్, జాతీయ కోశాధికారి బాలేషం గౌడ్, జాతీయ ఉపాధ్యక్షులు ముత్యం నర్సిలు గౌడ్,రాష్ట్ర ప్రచార కార్యదర్శి సింగితం నర్సాగౌడ్, రాష్ట్ర కార్యదర్శి బచ్చనగారి కిషన్ గౌడ్, రాష్ట్ర యూవజన అధ్యక్షులు రవి గౌడ్, జిల్లా గౌరవ అధ్యక్షులు రాగుల కిరణ్ కుమార్ గౌడ్,రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తిని నర్సిలు గౌడ్, యువజన వర్కిగ్ అధ్యక్షులు పచ్చిమడ్లస్వామి గౌడ్, రణం శ్రీనివాస్ గౌడ్, మండల అధ్యక్షులు మదాస్ స్వామి గౌడ్,జిల్లా కార్యదర్శి వెంకట్ గౌడ్, వడ్డేపల్లి రాజ గౌడ్,నవీన్ గౌడ్, నర్సాగౌడ్, పంజాల వెంకట్ గౌడ్,పెంట గౌడ్,మల్ల గౌడ్, ముత్యాలు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ట్రాక్టర్ డ్రైవర్‌కు ఆర్థిక సాయం



నవతెలంగాణ-దౌల్తాబాద్

మండల పరిధిలోని దొమ్మాట గ్రామానికి చెందిన అక్కమొల్ల కనకయ్య గత కొంతకాలంగా గుండెనొప్పితో బాధపడుతూ ఆర్ వి ఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకొని దొమ్మాట టాక్టర్స్ యజమానులు గురువారం ఆసుపత్రిలో కనకయ్య భార్య లక్ష్మికి రూ.20వేల ఆర్థిక సాయం చేశారు. అనంతరం యజమానులు మాట్లాడుతూ కనకయ్య కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని వారు తెలిపారు.

బీటీ రోడ్డు వేయాలని వరినాట్లతో నిరసన

నవ తెలంగాణ- దుబ్బాక

దుబ్బాక-లచ్చపేట పెద్ద చెరువు మత్తడిపై బాక్స్ కల్వర్టు నిర్మాణం చేపట్టి ఏడాది గడుస్తున్నా దానిపై బీటీ రోడ్డు వేయడం లేదు. ప్రజా ప్రతినిధులు, ఎమ్మెల్యే, ఎంపీలకు పలుమార్లు విన్నవించినా స్పందించడం లేదని లచ్చపేట వార్డు ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కల్వర్టు నిర్మాణాన్ని చేపట్టిన కాంట్రాక్టర్ గత 6 నెలలుగా పనులు ఆపేసి తప్పుకున్నాడని వార్డు యువకులు ఆరోపిస్తున్నారు. కల్వర్టు చుట్టుపక్కల ఇళ్ల ప్రజలు మొన్నటి వరకు దుమ్మూధూళితో, నేడు వర్షాలతో బురద వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని చెబుతున్నారు. గురువారం యువకులు హరీష్, చందు, నరేష్, రాము, నితీష్, మధు బురద రోడ్డుపై వరినాట్లు వేసి నిరసన తెలిపారు. బురద రోడ్డుపై పలువురు జారిపడ్డారని, ఇకనైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే డాంబర్ రోడ్డును వేయాలని లచ్చపేట యువకులు కోరుతున్నారు.



ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం

లోతట్టు ప్రాంతాలు జలమయం

పారుతున్న పెద్ద వాగు

నవతెలంగాణ-నంగునూరు

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో మూడు రోజుల నుండి నంగునూరు మండలంలో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. గ్రామాల్లో వర్షంతో మట్టి రోడ్లు చిత్తడిగా మారాయి. మూడు రోజుల నుండి కురుస్తున్న వర్షాల వల్ల శిథిలావస్థకు చేరిన ఇండ్లలో ఉండకూడదని రెవెన్యూ అధికారులు వెల్లడించారు. వర్షాల కోసం ఎదురు చూస్తున్న రైతులకు ఊరట లభించింది. ఆరుతడి పంటలు వేసుకున్న రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇన్ని రోజులు వర్షాల కోసం ఎదురు చూస్తున్న రైతులు పొలం పనులు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. నంగునూరు మండలం దర్గపల్లి శివారులో చెక్ డ్యాం పై కల్వర్టు పనులు కొనసాగుతున్నాయి. దర్గపల్లి నుంచి చిన్న కోడూరు మండలానికి వెళ్ళేందుకు తాత్కాలికంగా పైపులు వేసి రోడ్డు వేశారు. వర్షాలకు ఆ రోడ్డు తెగిపోయింది. దీంతో ఆ మార్గం గుండా వెళ్ళేందుకు వీలు లేకుండా పోయింది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు పెద్ద వాగు నిండి పారుతుంది.నంగునూరు మండలం లోని ఖాతా, ధూల్మిట్ట మండలం జాలపల్లి, నంగునూరు మండలం ఘనపూర్, నంగునూరు, అక్కెనపల్లి గ్రామాల్లో తొమ్మిది చెక్ డ్యాంలు నిర్మించారు. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు తొమ్మిది చెక్ డ్యాంలు నిండి పారుతున్నాయి. దీంతో పెద్ద వాగు జలకళ సంతరించుకుంటుంది. దాదాపు ఐదు కిలో మీటర్ల ప్రాంతాల్లో ఆయకట్టు దారులకు ఖరీఫ్ సాగు చేయడానికి అనుకూలంగా వుండే అవకాశాలు ఉంటాయి. పెద్ద వాగు ఉధృతంగా ప్రవహించడంతో కోహెడ మండలం బస్వాపూర్ గ్రామ సరిహద్దుల్లో మోయతుమ్మద వాగుపై రాకపోకలు నిలిచిపోయాయి. సముద్రాల క్రాసింగ్ నుంచి గట్లమల్యాల, నంగునూరు మండల కేంద్రం మీదుగా రాంపూర్ క్రాసింగ్ ద్వారా సిద్ది పేటకు వాహనాలు తరలించారు.









రాఖ్రేను సన్మానించిన కత్తి కార్తీకగౌడ్



నవతెలంగాణ- దుబ్బాక

హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో జరిగిన కాంగ్రెస్ అధికార ప్రతినిధుల సమావేశంలో టీపీసీసీ ఇంచార్జ్ మానిక్‌రావు ఠాక్రేను తెలంగాణ కాంగ్రెస్ ప్రచార కమిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్, తెలంగాణ కాంగ్రెస్ అధికార ప్రతినిధి కత్తి కార్తీకగౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఠాక్రేకు పుష్పగుచ్చం అందించి శాలువా సన్మానించారు. టీపీసీసీ మాజీ ఆర్గనైజింగ్ సెక్రటరీ కర్నాల శ్రీనివాసరావు, వీరగోని శ్రీనివాస్ గౌడ్ పలువురున్నారు.

వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- ఎస్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షురాలు మహమ్మద్ సుల్తానా ఉమర్

నవ తెలంగాణ రాయపోల్



రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షురాలు సామాజిక ప్రజాసేవకురాలు మహమ్మద్ సుల్తానా ఉమర్ అన్నారు. భారీ వర్షాలకు ప్రజలు అవస్థలు పడుతున్నారని తెలిపారు. రైతులు ప్రజలు మహిళలు చిన్నపిల్లలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లకూడదన్నారు. స్తంభాలు, విద్యుత్ వైర్లను తాకరాదని సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అవసరమైతే తప్ప బయటకి వెళ్లకూడదన్నారు.

పంచాయతీ కార్మికులకు 11వ పీఆర్సీ అమలు చేయాలి

సీఐటీయూ సిద్దిపేట జిల్లా నాయకులు కే వెంకటాచారి



నవ తెలంగాణ- గజ్వేల్

గ్రామ పంచాయతీ కార్మికులందరికీ 11వ పీఆర్సీ అమలు చేయాలని, ఈఎస్ఐ, పీఎఫ్, చట్టపరమైన సౌకర్యాలు అమలు చేయాలని సీఐటీయూ సిద్దిపేట జిల్లా నాయకుడు వెంకట్‌చారి డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మెలో ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో పని చేసే కార్మికులందరూ నిరుపేద దళిత కుటుంబానికి చెందినవారని కొవ్వొత్తులా కరిగిపోతూ తమ ఆరోగ్యాలు పాడైన గ్రామ ప్రజల బాగుకోసం మురికి చెత్తను తొలగించడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు మొదటి ప్రాధాన్యతగా గ్రామపంచాయతీ కార్మికుల అమలు చేయాలన్నారు. కార్మికులకు వేతనాలు పెంచాలని, రూ.10 లక్షల బీమా సౌకర్యం కల్పించాలన్నారు. ఆదివారం, పండుగ సెలవులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన వారికి ప్రమోషన్స్ కల్పించి మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిద్దిపేట జిల్లాయూనియన్ నాయకులు వెంకట చారి స్వామి, శ్రీనివాస్, సాయిలు, నాగరాజు నరసింహులు, యాదగిరి, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థ ఇండ్లను ఖాళీ చేయండి

నవతెలంగాణ- దుబ్బాక

దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో శిథిలావస్థలో ఉన్న ఇండ్లలో ఎవరూ ఉండొద్దని, వెంటనే వాటిని ఖాళీ చేయాలని మున్సిపల్ కమిషనర్ పాతూరి గణేష్‌రెడ్డి గురువారం కోరారు. కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు ప్రాణ నష్టం వాటిల్లకుండా ఉండేందుకు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. శిథిలావస్థలో ఉన్న ఇండ్లను తొలగించుకోవాలని, నూతన ఇండ్ల నిర్మాణాల వద్ద ప్రమాదాలు జరగకుండా ఆ ఇండ్ల యజమానులు గుంతలు వంటి వాటికి రక్షణ కంచెలు ఏర్పాటు చేయాలన్నారు.

బీఆర్ఎస్ నాయకుడి మృతికి సంతాపం

నవ తెలంగాణ - సిద్దిపేట



సిద్దిపేట పట్టణానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సినియర్ నాయకులు మ్యాన శివాజీ అకాల మృతి పట్ల మంత్రి హరీశ్‌రావు సంతాపం వ్యక్తం చేశారు. పార్టీ ఆవిర్భావం నుంచి బీఆర్ఎస్ పార్టీ తొలితరం విద్యార్థి నాయకుడిగా, పార్టీకి అందించిన సేవలను మంత్రి కొనియాడారు. అతని కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అతని కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటానని తెలిపారు.

డిప్లమా సీట్లుకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-సంగారెడ్డి

ప్రభుత్వ పాలిటెక్నిక్ సంగారెడ్డి కళాశాలలో మిగిలిన డిప్లమా ఇన్ ఈసీఈ, ఈఈఈ సీట్లుకు స్పాట్ అడ్మిషన్ గురించి ఈనెల 25 నుంచి 27వ తేది వరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డా. యం. శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 25వ తేదిన కళాశాల లోని ఖాళీ సీట్ల గురించి నోటీస్ బోర్డుపై అతికిస్తారన్నారు. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెల 28న స్పాట్ అడ్మిషన్ ఉంటుందన్నారు. స్పాట్ అడ్మిషన్ కోసం వచ్చే అభ్యర్థులు వరిజినల్ సర్టిఫికట్, ఒకసెట్ జిరాక్స్ కాపీ తీసుకువచ్చి.. ఫీజు చెల్లించాలన్నారు.

ఘనంగా శివకుమార్ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-నారాయణఖేడ్

మండలంలోని తుర్కపల్లి గ్రామానికి చెందిన ఖేడ్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బావుగి శివకుమార్ జన్మదిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. పీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు, మాజీ ఎంపీ సురేష్ షేట్కర్ స్వగృహంలో ఉమ్మడి జిల్లా మాజీ ప్రణాళిక సంఘం సభ్యులు నగేష్ షేట్కర్ ఆధ్వర్యంలో శివకుమార్ తో కేక్ కట్ చేయించి జన్మదిన శభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా మాజీ జెడ్పీ కొ-ఆప్షన్ సభ్యులు రషీద్, ఖేడ్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తాహిర్ అలీ, మాజీ జెడ్పీ టీసీ చందర్ నాయక్, మాజీ జెడ్పీటీసీ రుప్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుద్ఘాతంతో ఎలక్ట్రిషియన్ మృతి

నవతెలంగాణ-పటాన్‌చెరు

ప్రమాదవశాత్తు 11కేవీ విద్యుత్ వైర్లకు తగిలి విద్యుద్ఘాతంతో ఎలక్ట్రిషియన్ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పటాన్‌చెరు పట్టణంలోని గౌతమ్ నగర్ కాలనీకి చెందిన శంషాద్దీన్(24) ఎలక్ట్రిషియన్‌గా పనిచేస్తున్నాడు. కాగా గురువారం మండలంలోని కర్ధనూర్ గ్రామంలో ఓ ఇంట్లో ఎలక్ట్రిషియన్ పనులు చేస్తుండగా.. మెయిన్ ఆఫ్ చేయడానికి పైకి వెళ్లగా ఇంటి ముందు ఉన్న 11 కేవీ లైన్ వైర్లకు ప్రమాదవశాత్తు తగిలాడు. దీంతో విద్యుద్ఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి సిరాజ్ద్దిన్ ఫిర్యాదు మేరకు బీడీఎల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భారీ వర్షాలకు కూలిన ఇల్లు

నవతెలంగాణ-కొండాపూర్

రెండ్రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి గంగారం గ్రామంలో రాజేష్ అనే వ్యక్తికి సంబంధించిన పెంకుటిల్లు గురువారం ఉదయం కూలిపోయింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు మాట్లాడుతూ.. తమది పేద కుటుంబమని, ఈ వర్షాలకు గూడు కూడా లేకుండా పోయిందని వాపోయారు. కూలిన ఇంట్లో రూ.25వేల విలువ గల సామగ్రి ఉన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. కాగా అధికారులు కూలిన ఇంటిని పరి శీలించి.. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని మహిళ మృతి

నవతెలంగాణ-కొండాపూర్

జాతీయ రహదారిపై బుధవారం రాత్రి జరిగిన ప్రమాదంలో గుర్తు తెలియని మహిళ మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం రాత్రి మండలంలోని మల్కాపూర్ శివారులో ఎన్‌హెచ్-65 ముంబై రహదారిపై కిష్టయ్యగూడెం చౌరస్తా వద్ద ఓ గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఓ మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలిది చామన ఛాయ రంగు అని, వయస్సు 45-50 మధ్య ఉంటుందని పోలీసులు తెలిపారు. బూడిద నిలువు గీతల తెల్లటి షర్టు, నీలి రంగు చీర ధరించి ఉన్నదన్నారు. ఎవరైనా గుర్తు పడితే 8712656748, 8712656722 నెంబర్‌లను సంప్రదించాలన్నారు.

మద్యం మత్తులో కాలువలో పడి వ్యక్తి మృతి

నవతెలంగాణ-పటాన్‌చెరు

మద్యం మత్తులో ఓ గుర్తుతెలియని వ్యక్తి కాలువలో పడి మృతి చెందిన ఘటన మండలంలోని బీడీఎల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కర్ధనూర్ శివారులో గల బీరప్ప ఆలయం పక్కనున్న మురుగునీటి కాలువలో 35 నుంచి 40 మధ్య నున్న ఓ గుర్తుతెలియని వ్యక్తి మద్యం మత్తులో నీటిలో పడి మృతి చెందాడు. స్థానికుల ఫిర్యాదు మేరకు బీడీఎల్ పోలీసులు మృతుడిని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బాధ్యతలు స్వీకరించిన నూతన ఎస్సైలు

నవతెలంగాణ-జహీరాబాద్, న్యాల్కల్

జహీరాబాద్ రూరల్ ఎస్సైగా సిహెచ్ ప్రసాద్‌రావు, హద్నూర్ ఎస్సైగా రామానాయుడు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణకు శాయశక్తుల్లా కృషి చేస్తానన్నారు. ప్రజలకు ఏమైనా ఇబ్బందులు ఉంటే నేరుగా వచ్చి సంప్రదించాలన్నారు.

గెరువియ్యకుండా దంచుతున్న వానలు

- కొట్టుకుపోయిన రోడ్లు
- జహీరాబాద్‌లోని లోతట్టు ప్రాంతాల్లో ఇండ్లలోకి వరదనీరు
- అస్తవ్యస్థమైన జనజీవనం







నవతెలంగాణ-జహీరాబాద్, వట్‌పల్లి, ఝరాసంఘం

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పాపీడన ద్రోని వాయు గుండంగా మారడంతో.. ఉపతల ఆవర్తనం ఏర్పడి మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుసున్న వానలకు జన జీవనం స్తంభించిపోయింది. రోడ్లు, వంతెనలు కొట్టుకుపో వడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతున్నది. మరో నాలుగు రో జులు ఇదే పరిస్థితి ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

జహీరాబాద్‌లోని లోతట్టు ప్రాంతాలైన వసంత్ విహారకాలనీ, బృందావన్ కాలనీ, బాగారెడ్డిపల్లెలలోని ఇండ్లల్లోకి భారీగా వరద నీరు వచ్చి చేరింది. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ అధికారులు నష్ట నివారణ చర్యలు చేపట్టినప్పటికీ.. అనుకున్న స్థాయిలో స్పందించకపోవడంతో ఆయా కాలనీల్లోని ప్రజలు ఇళ్ల నుండి బయటకు రావడం కష్టంగా మారింది. చుట్టూ వర్షపు నీరు నిండి ఉండడం.. మరోవైపు ఆ నీటిపై విష సర్పాలు సంచరిస్తుండడంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి తక్షణమే వర్షపు వరద నీరు వెళ్లే విధంగా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. జహీరాబాద్ పట్ట ణంతో పాటు వివిధ ప్రాంతాల్లోని రోడ్లు వర్షపు నీటితో నిండిపోవడంతో ప్రయాణికులు గుంతల్లో పడి గాయ పాలవుతున్నారు. భారత్‌నగర్, అల్గోల్ రోడ్డు, అల్లానారుడు హుగ్గిలి రోడ్డు, హోతి బీ రోడ్డు, చిన్న హైదరాబాద్, కొత్తూర్, దిడిగి గ్రామాలకు వెళ్ళేట రోడ్లు వర్షపు తాకిడికి దెబ్బతిని గుంతల మయంగా మారాయి. సంబంధిత శాఖ అధికారులు రోడ్ల మరమ్మతుకు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు. జహీరాబాద్ నుండి భారత్‌నగర్ వెళ్లే రోడ్డు తీవ్ర ప్రమాదకరంగా మారడంతో లారీలన్నీ గుంతల్లో ఇరుక్కుపోయి ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

వట్‌పల్లి మండలంలోని షాద్‌నగర్ శివారులో రహదారి పై నీటితో నిండిన గుంతలు కనిపించకపోవడంతో బైకుతో సహా పడిపోయిన గొర్రెకల్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి బుధవారం తీవ్ర గాయాలయ్యాయి. బూత్కూర్ రోడ్డు బురదమయం కావడంతో కాలినడక సైతం వెళ్లలేని దుస్థితి దాపురించింది. కేరూరు మరవెల్లి గ్రామాల మధ్యన వంతెన వద్ద రోడ్డు కొట్టుకుపోయి 15 రోజులు అవుతున్నది. అయినా ఎవ్వరూ పట్టించుకోకపోవడంతో.. విద్యార్థులు పాఠశాలలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నారాయణఖేడ్ డిపో చెందిన వట్‌పల్లి, మరువెల్లి, కన్నాన్పల్లి మీదుగా వెళ్తున్న ఆర్టీసీ బస్సు రద్దు కావడంతో ఐదారు గ్రామాల ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. కేరూర్‌లో గురువారం కురిసిన వర్షంతో లోతట్టు ప్రాంతంలో ఉన్న దేవాలయము నీట మునిగింది.

ఝరాసంగం మండల వ్యాప్తంగా వర్షాలు జోరుగా కురుస్తున్నాయి. వర్షాకాలం ప్రారంభమై నెలన్నర దాటినా ఆశించినంత వర్షాలు కురియకపోవడంతో ఆందోళన చెందు తున్న రైతులు ఊరట చెందారు. పత్తి విత్తనాలు వేసుకుని ఎదురుచూస్తున్న రైతులు వర్షాలు ముఖం చాటేయడంతో ఆందోళన చెందుతున్న క్రమంలో వర్షాలు కురవడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మండల వ్యాప్తంగా గత ఐదు రోజుల నుండి ఎడతెరపి లేకుండా చిరుజల్లులు కరుస్తూనే ఉన్నాయి. దీంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. భూగర్భ జలాలు పెరిగి బోరు బావులలో కొత్తనీరు వస్తుంది. భారీగా వర్షాలు కురవడంతో ఆయా గ్రామాలలో లోతట్టు పత్తి పంట పొలాల్లో భారీగా నీరు నిలిచింది. మండల వ్యాప్తంగా గత 24 గంటల సాధారణ వర్షపాతం 59.6 ఎం.ఎం గా నమోదు కాగా, గురువారం ఉదయం 8.30 నుండి మధ్యాహ్న 3 గంటల వరకు 10.5 ఎం.ఎంల వర్షపాతం నమోదైనట్లు మండల సహాయ గణాంక అధికారి పేర్కొన్నారు.

అధికారులు ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలి



నవతెలంగాణ-పటాన్‌చెరు

భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అత్యవసర పరిస్థితుల్లోనే ప్రజలు బయటకు రావాలని, ఎటువంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని కృషి డిఫెన్స్ కాలనీలో వర్షాల మూలంగా భారీగా వరద నీరు చేరిన సమాచారం మేరకు వివిధ శాఖల అధికారులతో కలిసి గురువారం రాత్రి ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి కాలనీలో పర్యటించారు. వరద నీరు తరలించేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు.కాలనీ వాసులు భయపడాల్సిన అవసరం లేదని, అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని ధైర్యం చెప్పారు.అనంతరం పాటి చౌరస్తాలో గల విద్యుత్ సబ్ స్టేషన్ ను పరిశీలించారు. వరద నీరు ఉప్పొంగి సబ్ స్టేషన్ లోకి చేరుతోందని, విద్యుత్ అంతరాయం తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మరో నాలుగు రోజులు భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ అధికారుల సూచనలకు అనుగుణంగా.. నియోజకవర్గ పరిధిలోని అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నామని తెలిపారు. ప్రధానంగా వరద ముంపు ఉన్న ప్రాంతాలలో ప్రజలను అప్రమత్తం చేస్తూ, అత్యవసర బృందాలను అందుబాటులో ఉంచామని తెలిపారు.ఇప్పటికే ప్రభుత్వం విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించడం జరిగిందని, ప్రజలు అత్యవసర పరిస్థితుల్లోనే ప్రయాణాలు చేయాలని మరో సారి విజ్ఞప్తి చేశారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తిన స్థానిక పోలీసులకు, ప్రజా ప్రతినిధులకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ పరమేశం, సీఐ లాలునాయక్, జిహెచ్ఎంసీ డిప్యూటీ కమి షనర్ సురేష్, విద్యుత్‌శాఖ ఏడి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్న జెడ్పీటీసీ నరసింహారెడ్డి

నవతెలంగాణ-కల్హేర్

తెలంగాణ రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ చైర్మెన్‌గా మఠం బిక్షపతి, స్టేట్ ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ చైర్మెన్‌గా మాజీ ఎమ్మెల్సీ ఫరిదోద్దీన్ కుమారుడు తన్వీర్ గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. హైదరాబాద్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో కల్హేర్ జెడ్పీటీసీ నరసింహారెడ్డి పాల్గొని.. వారిని శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రోడ్లు భవనాల శాఖ మంత్రి ప్రశాంత్ రెడ్డిని కలిసి మర్యాదపూర్వకంగా కలిసి ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పీఎస్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పైతర్ సాయి కుమార్, జిల్లా డీలర్ సంఘం అధ్యక్షులు విజేందర్‌రెడ్డి,సంజీవులు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ముందస్తు అరెస్టులు

నవతెలంగాణ-జహీరాబాద్

బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి గురువారం చేపట్టిన హైదరాబాద్ శివారు బాటసింగారంలో డబుల్ బెడ్రూం ఇండ్ల క్షేత్రస్తాయి సమీక్ష కార్యక్రమానికి బీజేపీ శ్రేణులు వెళ్లకుండా పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

జహీరాబాద్ బీజేపీ నాయకులను అరెస్ట్ చేసిన పోలీసులు.. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నౌబా జగన్నాథ్ మాట్లాడుతూ.. డబుల్ బెడ్ రూం ఇండ్లను పూర్తి చేసినా.. పేదలకు ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం మోసం చేస్తున్నదన్నారు. అనేక డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నాణ్యతా లేమిగా ఉన్నాయని.. వర్షానికి పూర్తిగా తడిసి ఎప్పుడు కూలుతాయో అన్న విధంగా ఉన్నాయని ఎద్దేవా చేశారు. వెంటనే అర్హులందరికీ డబుల్ బెడ్ రూమ్ లు కేటాయించాలన్నారు. అరెస్టు అయిన వారిలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నౌబా జగన్నాథ్, మండలాధ్యక్షులు కొత్తకాపు వీరారెడ్డి, జిల్లా నాయకులు జయకృష్ణ, ప్రతాప్ రెడ్డి,మండల ప్రధాన కార్యదర్శి శివలాల్, సిద్ధప్ప, రాజు బీజేవైఎం మండలా ధ్యక్షుడు సుభాష్, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులు ప్రభు, సుదర్శన్ రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, బసప్ప, స్వామి, బలవంత్, జగదీష్, నర్సింలు తదితరులున్నారు.

సంగారెడ్డి : సంగారెడ్డి బీజేపీ నాయకుల అరెస్టును బీజేపీ పట్టణ అధ్యక్షులు ప్రసాది రవిశంకర్ ఖండించారు. జిల్లా బీజేవైఎం అధ్యక్షులు పవన్, ఎస్సీ మోర్చ అధ్యక్షులు అశ్వంత్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి రాకేష్ పలువురు నాయకులను పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేయడం సరైంది కాదన్నారు.

నారాయణఖేడ్ : ఖేడ్‌లో బీజేపీ, బీజేవైఎం నాయకులను ముందస్తు అరెస్టులు చేశారు. అరెస్టు అయిన వారిలో బీజేపీ జిల్లా కార్యదర్శి నగేష్ యాదవ్, బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ రవికుమార్, అసెంబ్లీ కో-కన్వీనర్ పట్నం మాణిక్, పార్టీ సీనియర్ నాయకులు సాయిరాం, నందు తదితరులు ఉన్నారు.

సదాశివపేట : బీజేపీ రాష్ట్ర నాయకుడు నెమలికొండ వేణుమాధవ్‌ను సదాశివపేట పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం దమన నీతితో వ్యవహరిస్తున్నదని ఆరోపించారు. ప్రజల గొంతుకలను, బీజేపీ నాయకులను అరెస్టులతో ఇబ్బంది పెడుతున్నదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ అసెంబ్లీ కన్వీనర్ శ్రీకాంత్, బీజేపీ దళితమోర్చా కార్యదర్శి బైండ్ల చిన్న పాల్గొన్నారు.

మునిపల్లి : డబుల్ బెడ్ రూం ఇండ్ల పరిశీలనకు వెళ్లకుండా బీజేపీ మండల నాయకులను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా పల్లె నాగేష్ యాదవ్, ఉపేందర్‌లు మాట్లాడు తూ.. రాష్ట్ర ప్రభుత్వం అహంకాపూరితంగా వ్యవహరి స్తున్నదన్నారు. అరెస్టు అయిన వారిలో రఘురాం, ఉపేందర్, చందు గౌడ్, నర్సిములు, తదితరులు పాల్గొన్నారు.

న్యాల్‌కల్ : బీజేపీ మండల నాయకులు18 మందిని గంగ్వార్ చౌరస్తాలో అదుపులోకి తీసుకున్నట్టు జహీరాబాద్ రూరల్ సీఐ నోముల వెంకటేష్ తెలిపారు. అరెస్టు అయిన వారిలో బీజేపీ నాయకులు ఏక్‌నాథ్, మల్లేష్, ప్రభాకర్‌చారి, శ్రీనివాస్ రెడ్డి, ఓంకార్ ఉన్నారు.